RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers



హైదరాబాద్ 06 సెప్టెంబర్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:86

# రెండేళ్లు సమయం ఇవ్వండి.

## ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను

## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ




రెండు సంవత్సరాలపాటు సహకరించి వెసులుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్ల వంటి ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. నిరుపేదల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టిన ఈ దశలో తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక దిక్సూచిలా నిలబెట్టడానికి ఉపాధ్యాయులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రి దామోదర రాజనర్సింహ , ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మిగతా 2 లో

## అసెంబ్లీ సమావేశాలపై సమీక్ష




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్....సోమవారం నుండి ప్రారంభం కానున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ (అసెంబ్లీ) మరియు తెలంగాణ శాసన పరిషత్ (కౌన్సిల్) వర్షాకాల సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు శాసన పరిషత్ సమావేశ మందిరంలో సన్నాహక సమావేశం నిర్వహించిన శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన పరిషత్ చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ , కౌన్సిల్ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

# నల్గొండ జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని నిరూపించారు..

# సీఎం రేవంత్ రెడ్డి



## కేసీఆర్ సిద్ధంగా ఉంటు.. అసెంబ్లీకి రా.. లేకుంటే గౌరవంగా రాజీనామా చేయి.. గజ్వేల్ లో తేల్చుకుందాం..



నల్గొండ జిల్లా నకిరేకల్ లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

కార్యక్రమం లో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ ,ప్రభుత్వ విప్ వేముల వీరేశం,బీర్ల ఐలయ్య, ఉమ్మడి నల్గొండ జిల్లాఎంఎల్ ఏ లు,ఎంఎల్సీ లు.

నకిరేకల్‌లో 32 కోట్లతో నూతనంగా నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రి ని ప్రారంభించిన ముఖ్యమంత్రి.

నకిరేకల్ నియోజకవర్గంలో ?9.85 కోట్ల వ్యయంతో నిర్మించే తెలంగాణ పబ్లిక్ స్కూల్ (TGPS) భవనానికి శంకుస్థాపన .

నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో 200 కోట్ల వ్యయంతో నిర్మించే "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్"కు శంకుస్థాపన.

మునిపంపుల గ్రామంలో 3.62 కోట్ల వ్యయంతో నిర్మించే 1ఐ5 MVA పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (PTR), 33/11 KV సబ్‌స్టేషన్, 33 KV & 11 KV విద్యుత్ లైన్లు మరియు కంట్రోల్ రూమ్ పనులకు శంకుస్థాపన.

కేతేపల్లి మండలం గుడివాడ గ్రామంలో 2.74 కోట్లతో నిర్మించిన 1ఐ5 వీఖాౄాౢ=తో కూడిన 33/11 KV సబ్‌స్టేషన్ మరియు 33 ఖఌ, 11 ఖఌ లైన్ల ప్రారంభోత్సవం.

నకిరేకల్ మండలంలో ?20 కోట్లతో నిర్మించే సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయానికి (MDO/MRO complex) శంకుస్థాపన.

45.60 కోట్ల వ్యయంతో చేపడుతున్న కింది రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన:

నకిరేకల్--గురజాల రోడ్ నుండి బైరౌనిబండ వరకు

బైరౌనిబండ నుండి అమ్మనబోలు--రామాంజాపూర్ రోడ్ వరకు

అమ్మనబోలు--రామాంజాపూర్ రోడ్డు విస్తరణ/అభివృద్ధి పనులు

నకిరేకల్‌లో ?1.10 కోట్లతో నిర్మించనున్న 'ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్' భవనానికి శంకుస్థాపన.

నకిరేకల్ సభలో సీఎం రేవంత్ రెడ్డి స్పీచ్ మాట్లాడుతూ

నల్గొండ జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని నిరూపించారు.. నకిరేకల్ కాంగ్రెస్ ఖిల్లా అని వేలాది మంది తో వేముల వీరేశం బహిరంగ సభ తో చూపించారు..

కాంగ్రెస్ కోసం ప్రాణాలు ఇచ్చే కార్యకర్తలతో పాటు ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు వేలాదిగా వచ్చి ఆశీర్వధించారు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకుంది..

1000 రోజుల్లో అద్భుతమైన పథకాలను తీసుకువస్తే కొంత మంది దుర్మార్గులు, సన్నాసులు ప్రభుత్వం ఫైయిల్ అయిందంటున్నారు..

ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ఊరూరా తిరుగుతున్నాడు..

పండుగ పూట వచ్చే గంగిరెద్దుల్లా తిరుగుతు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు..

పదేళ్ల ఆ నాటి పాలన, 1000 రోజుల మా పాలనను బేరీజు వేసుకుని చూడాలి..

వెయ్యి రోజుల ప్రజా పాలనలో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను అంచనా వేయాలి..

గత ప్రభుత్వం లో ప్రకటించిన పథకాలను మా ప్రభుత్వం రద్దు చేయలేదు..

గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను మరింత పెంచి ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. 2014 లో లక్ష రూపాయల రుణమాఫీ నాలుగు విడుతలు చేస్తే మిత్తికే సరిపోయింది..

రైతులు అప్పుల పాలయ్యారు..

మిగతా 3 లో

# ప్రపంచ ఏఐ మ్యాప్‌లో తెలంగాణ మరింత ముందుకు రేవంత్ రెడ్డి







దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఏర్పాటు కానుండటం తెలంగాణను ప్రపంచ ఏఐ మ్యాప్‌లో మరింత ముందుకు తీసుకెళ్లే చరిత్రాత్మక పరిణామమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ చేపట్టనున్న ఈ భారీ ప్రాజెక్టుతో హైదరాబాద్ గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా ఎదగడంతో పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడుతుందని చెప్పారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో టీసీఎస్ ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు , మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్ , సీఓఓ ఆర్తి సుబ్రమణియన్ హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి. రాజన్న , హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా , అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు గారు పాల్గొన్నారు.

ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న నేపథ్యంలో, ఆ స్థాయి కంప్యూటింగ్ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని ముఖ్యమంత్రి గారు అన్నారు. తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అవుతుందని చెప్పారు.

హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్‌తో పాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ కోసం దాదాపు రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని అభివృద్ధి చేయనున్నారు. గ్రీన్ ఎనర్జీ వినియోగం, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో పర్యావరణ అనుకూలంగా క్యాంపస్‌ను తీర్చిదిద్దనున్నారు.

ఈ భారీ పెట్టుబడితో ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లోనూ కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్, హైపర్ వాల్ట్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి అన్నారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు మరింత బలం చేకూర్చనుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు , ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డి టీజీఐఐసీ ఎండీ కె. శశాంక , పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి , ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ప్రజాబలం

06 సెప్టెంబర్ 2026 ఆదివారం

# జీడీపీ పెరుగుతోంది... కానీ...

2026 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. ఆర్‌బిఐ 7 శాతం వృద్ధి రేటును అంచనా వేసింది. దీని అర్థం భారతదేశ పనితీరు అంచనాలను మించిపోయింది.అయితే ఈ పెరుగుదలకు సామాన్య ప్రజలు చేసే కొనుగోళ్లు అతిపెద్ద కారణం కాదు రోడ్లు, కర్మాగారాలు, యంత్రపరికరాలు , ఇతర ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడి 11.9 శాతం పెరిగింది. సేవా రంగం 10 శాతం వృద్ధి చెందింది. బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఐటీ , వృత్తిపరమైన సేవలు 12.1 శాతం వృద్ధి చెందాయి. పోల్చి చూస్తే, సామాన్య ప్రజల వ్యయం 7.1 శాతం పెరగగా, వ్యవసాయ రంగం కేవలం 3.6 శాతం మాత్రమే పెరిగింది. దీని అర్థం ఏంటంటే, పెద్ద కంపెనీలు, తయారీ , సేవా రంగాలు దేశ వృద్ధిని నడిపించాయి. గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాలు , సాధారణ కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందుకే సానుకూల జీడీపీ గణాంకాలు గృహ బడ్జెట్‌లలో ఇంకా స్పష్టంగా ప్రతిబింబించడం లేదు. దేశాలు, పెద్ద కంపెనీలు ఎక్కువ సంపాదించవచ్చు, కానీ అదే వేగంతో కొత్త ఉద్యోగాలు ఉండవు. యంత్రాలు, కొత్త సాంకేతికత తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సాధించడానికి సహాయపడతాయి. దీనివల్ల ఉత్పత్తి, జీడీపీ పెరుగుతాయి, కానీ ఉద్యోగార్థులు తక్షణ ప్రయోజనాలను చూడలేరు.గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2011-12ను ప్రాతిపదికగా తీసుకున్న పాత విధానంలో కొందరు రూ.86 లక్షల కోట్లుగా లెక్కించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక జీడీపీని 2022-23 బేస్ ఇయర్‌గా తీసుకున్న కొత్త విధానంలో రూ.88 లక్షల కోట్లుగా లెక్కించారు.ఈ రెండు గణాంకాలను నేరుగా పోల్చడం వల్లే కొందరు విమర్శకులు వృద్ధి రేటు కేవలం 2-2.3 శాతమేనని చెబుతున్నారని నాగేశ్వరన్ పేర్కొన్నారు.అయితే, రెండు వేర్వేరు విధానాల్లో లెక్కించిన గణాంకాలను నేరుగా పోల్చడం సరికాదని స్పష్టం చేశారు.గత ఏడాది తొలి త్రైమాసిక జీడీపీ గణాంకాలను కూడా కొత్త విధానంలో తిరిగి లెక్కించి, ఆ తర్వాత ప్రస్తుత ఏడాది గణాంకాలతో పోల్చాలని సీఈఏ వివరించారు.పాత సిరీస్ కొనసాగి ఉంటే, కొత్త మెథడాలజీ ప్రకారం ఈజ26 ఖీ1 జీడీపీ రూ.86 లక్షల కోట్ల కంటే ఎక్కువగా, దాదాపు రూ.90 లక్షల కోట్లకు చేరి ఉండేదని ఆయన అంచనా వేశారు.అలా సవరించిన గత ఏడాది గణాంకంతో ప్రస్తుత ఏడాది రూ.88 లక్షల కోట్ల జీడీపీని పోల్చినప్పుడే వాస్తవికమైన, న్యాయమైన వృద్ధి రేటు తెలుస్తుందని చెప్పారు.అంతేకానీ, భిన్నమైన కొలమానాలతో వచ్చిన రెండు అంకెలను నేరుగా పోల్చి వృద్ధిని అంచనా వేయడం సరైన పద్ధతి కాదన్నారు.గత ఏడాది జీడీపీ గణాంకాల్లో వచ్చిన మార్పులకు కేవలం డబుల్ డిఫ్లేటర్ విధానమే కారణం కాదని నాగేశ్వరన్ తెలిపారు.మెరుగైన కార్యనిర్వహణ, అసంఘటిత రంగానికి మరింత విస్తృతమైన కవరేజీ వంటి పలు అంశాలు కూడా ఇందుకు కారణమని వివరించారు.కొత్త విధానంలో ఈజ26 గణాంకాలు పెరగకపోవడం కూడా గతంలోనే ఆర్థిక వ్యవస్థను సరైన స్థాయిలో కవర్ చేశామనడానికి ఒక సూచనగా ఆయన పేర్కొన్నారు.జీడీపీని లెక్కించేటప్పుడు నామినల్ జీడీపీ, అంటే ధరల మార్పుల ప్రభావంతో కూడిన గణాంకం నుంచి రియల్ జీడీపీని గుర్తించాలి.రియల్ జీడీపీ అంటే ధరల ప్రభావాన్ని తొలగించిన తర్వాత ఉత్పత్తి వాస్తవంగా ఎంత పెరిగిందో చూపించే గణాంకం.ఇందుకోసం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తొలగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపయోగించే సాధనాన్నే 'డిఫ్లేటర్' అంటారు.అంతర్జాతీయ సంస్థల సూచనలతోనే డబుల్ డిఫ్లేటర్ విధానం తీసుకోలేదుడబుల్ డిఫ్లేటర్ పద్ధతిని కేవలం అంతర్జాతీయ సంస్థల సూచనల మేరకే భారత్ అనుసరిస్తోందన్న వాదనను నాగేశ్వరన్ తోసిపుచ్చారు.గణాంక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ విధానాన్ని ఎంచుకున్నామని తెలిపారు.ఇన్‌పుట్, అవుట్‌పుట్ ధరలు వేర్వేరు కారణాల వల్ల మారుతుంటాయని, అందువల్ల వాటి ధరల ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడానికి డబుల్ డిఫ్లేటర్ పద్ధతి సరైనదని వివరించారు.దేశ ఆర్థిక వ్యవస్థ నమోదు చేసిన 7.8 శాతం వృద్ధి రేటు అకస్మాత్తుగా వచ్చినది కాదని నాగేశ్వరన్ స్పష్టం చేశారు.దీనికి ముందే పలు నెలవారీ ఆర్థిక సూచికలు బలమైన వృద్ధి సంకేతాలను ఇచ్చాయని తెలిపారు.జీఎస్టీ వసూళ్లు, ఈ-వే బిల్లుల జారీ, వాహన విక్రయాలు, ఎగుమతుల వృద్ధి, బ్యాంకు రుణాల పెరుగుదల వంటి సూచికలు ఆర్థిక కార్యకలాపాల్లో వేగాన్ని ముందుగానే సూచించాయని పేర్కొన్నారు.ఈ వివరాలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమ్స్, ప్రభుత్వ ఖజానా వంటి విశ్వసనీయ వనరుల నుంచి సేకరించినవేనని చెప్పారు. ఉద్యోగాలపై ప్రభావం చూపే అంశాలు ఒక్కటే కావని, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు, స్వచ్ఛందంగా ఉద్యోగం చేయకూడదనే నిర్ణయం వంటి అనేక అంశాలు దీనిపై ప్రభావం చూపుతాయని వివరించారు.ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉద్యోగాల వృద్ధికి సంబంధించిన ధోరణులు మెరుగ్గా ఉన్నాయని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు.

# రెండేళ్లు సమయం ఇవ్వండి.




మొదటి పేజీ తరువాయి

భారతదేశ మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించి ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఆర్థిక వెసులుబాటును బట్టి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. మిగతా శాఖలతో పోల్చితే విద్యా శాఖ ఆదర్శంగా నిలబడాలి. పిల్లల భవిష్యత్తుకు మార్గదర్శకులు మీరే. రెండేండ్లు సమయం ఇవ్వండి. రాష్ట్రంలోని ప్రతి ఉపాధ్యాయుడికి విజ్ఞప్తి చేస్తున్నా. రెండేండ్లలో సమస్యలన్నింటినీ సామర స్యంగా మీరు అడక్కుండానే పరిష్కరించే బాధ్యత నాది" అని స్పష్టం చేశారు.

"తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక రోల్ మాడల్‌గా నిలబెడుదాం. అందుకు కథానాయకులు ఉపాధ్యాయులే. అందుకు ఉపాధ్యాయులంతా పునరంకితం కావాలి. ఇంట్లో సొంత పిల్లలను ఏ విధంగా తీర్చిదిద్దాలనుకుంటున్నారో మీ వద్ద చదువుకుంటున్న విద్యార్థుల విషయంలోనూ అంతే శ్రద్ధ పెట్టాలి. ఉపాధ్యాయులపై నాకు సంపూర్ణమైన విశ్వాసం ఉంది.ప్రభుత్వ సర్వీసులో మీరు 30 ఏళ్లకు పైగా సేవలందిస్తారు. రాజకీయ నాయకులం ప్రతి ఐదేళ్లకు ఒకసారి మీముందుకొచ్చి పరీక్షలు రాయాల్సిందే. నేను చెప్పిన ప్రకారం చేయకుండా ఉంటే.. నిర్ణయం తీసుకోవలసింది మీరే. అందుకు మార్కులు వేయాల్సిందీ మీరే. మీ చేతిలోనే కలం ఉంది. మీ చేతిలోనే బలం ఉంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

"ఉపాధ్యాయులే వీధుల్లోకి వస్తే ప్రభుత్వానికి, రాష్ట్రానికి శుభ సూచకం కాదు. మిగతా శాఖలు వేరు. పిల్లల భవిష్యత్తుకు నిర్దేశకులు మీరు. మీరే ధర్నాలు చేస్తానంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ముఖ్యమంత్రిగా విజ్ఞప్తి చేస్తున్నా. రెండేళ్లు సమయం ఇవ్వండి. ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను. పీఆర్సీ, ఇంక్రిమెంట్‌లతో పాటు మిగతా సమస్యలు వేటిలోనూ చిన్న కష్టం రానివ్వను. సలహాదారు కేశవరావు గారితో కూర్చొని మాట్లాడండి. నన్ను విశ్వసించి సహకరించండి" అని విజ్ఞప్తి చేశారు.

"గత ప్రభుత్వంలో పదేండ్ల పాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. విధ్వంసం చేశారు. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే శక్తి ఉపాధ్యాయులపైనే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేల అడ్మిషన్లు పెరిగాయంటే ఆ గొప్పతనం ఉపాధ్యాయులదే. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు సంబంధించి ఎలాంటి వివాదం లేకుండా బదిలీల ప్రక్రియ పూర్తి చేశాం. జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించాం. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించాం. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే కాదు ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్ నియమించి ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురావడానికి ప్రయత్నం చేసింది. ఉపాధ్యాయుల ఆలోచనలను పరిగణలోకి తీసుకుని సాంకేతిక నైపుణ్యంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నాం.ప్రభుత్వ విధానంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి. మనమంతా లక్షలాది విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఉన్నాం. అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. సహకరించండి. నిస్సందేహంగా ఈ ప్రభుత్వం మీ సమస్యలను పరిష్కరిస్తుంది" స్పష్టంగా చెప్పారు.

"జాతీయ విద్యా విధానంతో విద్యా రంగంలో ఎన్నో మార్పులొస్తున్నాయి. మనం కూడా విధానాలు మార్చుకోవాలి. నిరుపేద పిల్లలు తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆశిస్తున్నారు. కాలం తీరిపోయిన విద్యా విధానంతోనే వెళదామా. అప్ డేటెడ్ విద్యా విధానాన్ని అందిపుచ్చుకుందామా?పాలిటెక్నిక్ కాలేజీలు టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఉంది. ప్రపంచంలోనే అత్యుత్తమ నాలెడ్జ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పాలిటెక్నిక్ విద్యను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేస్తే, ప్రైవేటీకరణ చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేశారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడం వల్ల ఈరోజు ఫలితాలను చూస్తున్నాం. పాలిటెక్నిక్‌లో రెండేళ్లు థియరీ, మూడో సంవత్సరం కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్న్‌గా పనిచేసే విధానం తీసుకొస్తున్నాం. ఇంటర్న్‌గా ఉన్నప్పుడు కార్పొరేట్ కంపెనీలు రూ. 9 వేల వరకు స్టయిఫండ్ కూడా ఇస్తాయి. పాలిటెక్నిక్ ఇప్పటివరకు డిప్లమాలే జారీ చేస్తున్నాయి. విదేశాల్లో మాస్టర్స్ చదువుకోవడానికి వీలుగా డిగ్రీ పట్టాను అందించే విధంగా మార్పులు చేశాం. పాలిటెక్నిక్ పూర్తి చేస్తే ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరడానికి అవకాశం కోల్పోతామన్న తప్పుడు ప్రచారంపై విద్యార్థులు మోసపోవద్దు. నిస్సందేహంగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరడానికి వీలుంది. అందులో ఎలాంటి మార్పు ఉండదు. అలాగే లెక్చరర్లకు సర్వీసు నిబంధనల విషయంలోనూ ఎలాంటి ధోకా ఉండదు. సర్వీస్ రూల్స్ వేరు, విద్య విధానం వేరు. ఈ విషయంలో ఇంకా అనుమానాలు ఉంటే సలహాదారు కేశవరావు తో కూర్చొని మాట్లాడండి. ప్రభుత్వం తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయి. జీతభత్యాలు, పీఆర్సీ, ఇంక్రిమెంట్లు నష్టం కలగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిది" అని విస్పష్టం చేశారు.?? "మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో స్కిల్స్ నేర్పించడానికి ప్రాధాన్యతనిస్తున్నాం. ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి ఏటీసీలు మార్చాం. కార్పొరేట్ కంపెనీల సమన్వయంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధానాలను ప్రారంభించాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్య (నాలెడ్జ్ అండ్ కమ్యునికేషన్) ను అందించి 12వ తరగతి తర్వాత నైపుణ్యంలో శిక్షణ ఇప్పించాలి. సాంకేతిక నైపుణ్యం ఉంటే ప్రపంచంలో రాణించగలరు. ఇంజనీరింగ్ పట్టా ఉన్న వారికన్నా నైపుణ్యం ఉన్నవారికి అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి" అని వివరించారు."ప్రపంచ వ్యాప్తంగా ఫోకస్ మారింది. స్కిల్స్ ఉన్నవారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియా లాంటి దేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. స్కిల్స్ తర్వాత ఇన్నొవేషన్ అండ్ ఎంప్లాయిమెంట్ వైపు దృష్టి సారించాలి. యూనికార్న్‌గా నిలబడాలి. ఏరోస్పేస్ రంగంలో స్టార్టప్ కంపెనీ స్కైరూట్ ఈనాడు ఎలాన్ మస్క్ కంపెనీతో పోటీ పడుతోంది. ఇన్నొవేషన్‌పై ఫోకస్ పెట్టాలి. ఇలాంటి వాటిల్లో ప్రభుత్వం అండగా ఉంటుంది. వాటన్నింటికీ వారధి, సారథులు ఉపాధ్యాయులే. రెండేళ్లు ఫోకస్డ్‌గా పనిచేయండి. ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకోండి. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిద్దాం" అని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. "పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు. విద్యా రంగంలో జాతీయ సగటులో 28 స్థానంలో ఉన్న తెలంగాణను 17వ స్థానానికి ఎదగడం ఉపాధ్యాయుల వల్లే సాధ్యమైంది. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేలకు పైగా విద్యార్థులు అధికంగా అడ్మిషన్లు తీసుకున్నారంటే ఆ విజయానికి టీచర్లే కారణం. 30-35 ఏళ్లు కష్టపడి ప్రజలకు సేవలు అందించి రిటైరైన తర్వాత బెనిఫిట్స్ ఇవ్వకపోగా పదవీ విరమణ వయస్సును 58 నుంచి 61 చేయడం వల్ల 2025 నుంచి రిటైర్మెంట్లు మొదలయ్యాయి. గత ప్రభుత్వం దాదాపు 8 వేల కోట్ల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెడితే, ఎక్కడెక్కడ అవకాశం ఉందో అక్కడ నిధులను కూడదీసి వంద రోజుల్లో రూ. 6 వేల కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం చెల్లించాం" అని గుర్తుచేశారు.

# సీఎం రేవంత్ ను దూషించలేదు.. అప్పుడు అన్నది ఒకట్రెండు విషయాల్లోనే: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**రేవంత్ తో తనకు వ్యక్తిగత వైరం లేదన్న రాజగోపాల్ రెడ్డి**

**తన నిజయకవర్గానికి కొడంగల్ స్థాయిలోనే నిధులు వచ్చాయని ప్రశంస**

**సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో వెళతానని వెల్లడి**



కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు.

రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

# మామ గారి ఆస్తులు అమ్మకం..

హైదరాబాద్, సెప్టెంబర్ 5, మేఘా.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. మనదేశంలోని ప్రధాన రాష్ట్రాల్లోనే కాదు.. ఏకంగా 20 దేశాలలో కార్యకలాపాలు సాగిస్తోంది. కొన్ని దశాబ్దల క్రితం ఒక సాధారణ పైపుల కంపెనీగా ప్రారంభమైంది మేఘా కంపెనీ. పిచ్చిరెడ్డి.. ఆయన మేనల్లుడు కృష్ణారెడ్డి ఈ కంపెనీని నిర్వహిస్తున్నారు.ముఖ్యంగాన్ఫ్రా రంగంలో ఈ కంపెనీ తిరుగులేని స్థాయిలో ఉంది. 2024 ఎన్నికలకు ముందు దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో ఈ సంస్థ రెండవ స్థానంలో ఉంది. కాళేశ్వరం.. పోలవరం హెడ్ వర్క్స్.. జోజిలా అండర్ టన్నెల్.. ఇంకా అనేక రకాల పనులను ఈ కంపెనీ చేపడుతోంది. కృష్ణారెడ్డికి ఇద్దరు కుమారులు. భార్య సుధా రెడ్డి కూడా వ్యాపారంలో ఉన్నారు. ఇటలీలో ఆయిల్ రిగ్గింగ్.. డిఫెన్స్ రంగంలో పరికరాల తయారీ.. ఇంకా అనేక విభాగాలలో కృష్ణారెడ్డి కుమారులు వ్యాపారాలు చేస్తున్నారు. సుధా రెడ్డి కూడా ఫ్యాషన్ ఐకాన్ గా ఉన్నారు. పిచ్చిరెడ్డికి వారసులు లేరు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పైగా ఈ కంపెనీలో ఉన్న 43 శాతం వాటాను అమ్మాలని.. ఆ బాటను అమ్మితే వచ్చే డబ్బును ఇద్దరి కుమార్తెలకు సమానంగా పంచాలని.. 65 సంవత్సరాలకు మించిన వయసులో ఉన్న తాను హాయిగా రెస్టు తీసుకోవాలని పిచ్చి రెడ్డి అనుకుంటున్నట్టు తెలుస్తోంది.ఈ కంపెనీలో కృష్ణారెడ్డికి ప్రస్తుతం 51 శాతం వాటా ఉంది. మిగతా వాటాను కూడా కొనుగోలు చేస్తే కృష్ణారెడ్డి ఈ కంపెనీకి పూర్తిస్థాయిలో యజమానిగా మారిపోతారు. పిచ్చిరెడ్డి సంబంధించిన వాటాను కొనుగోలు చేయడానికి కృష్ణారెడ్డి అంతర్జాతీయ ప్రైవేట్ క్రెడిట్ ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయం ప్రకారం ఈ డీల్ విలువ దాదాపు 15వేల కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఈ వాటా కొనుగోలు కోసం దాదాపు 6650 కోట్లను ప్రైవేటు ఇన్వెస్టర్ల నుంచి కృష్ణారెడ్డి సమీకరిస్తున్నట్టు సమాచారం.కంపెనీని కొనుగోలు చేసిన తర్వాత నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలో లిస్ట్ చేయాలని కృష్ణారెడ్డి అనుకుంటున్నట్టు తెలుస్తోంది. తద్వారా కంపెనీ విలువ పెరుగుతుందని.. గ్లోబల్ వ్యాప్తంగా మరిన్ని ప్రాజెక్టులు చేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని కృష్ణారెడ్డి భావిస్తున్నారు.న్ఫ్రా విభాగంలో తలనొప్పులు విపరీతంగా ఉంటాయి. ప్రాజెక్టులు తీసుకురావడం.. ప్రభుత్వాలతో మాట్లాడటం.. ఏజెన్సీలను ఒప్పించడం.. ఇంకా తెర వెనుక వ్యవహారాలను సాగించడం అంత ఈజీ కాదు.

# నల్గొండ జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని నిరూపించారు.. సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

2018 లో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పితే అసలుకు, మిత్తికి పంగనామం పెట్టారు..
అవుటర్ రింగ్ రోడ్డు ను అమ్ముకుని 7 వేల కోట్లు దిగమింగిపోయారు..
చివరి విడత రైతు బంధు వేయకుండా మోసం చేసి గద్దె దిగిపోయాడు..
ఇరవై ఐదు లక్షల ముప్పై ఐదు వేల మంది రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశాం..
సిద్ధిపేట, సిరిసిల్ల గడ్డపైన చర్చకు మేం సిద్ధం..
32 నెలల్లో 36 వేల కోట్ల రూపాయలను రైతు భరోసా వేశాం.. అసెంబ్లీలో చర్చకు సిద్ధం..
వరి వేసుకుంటే ఊరే అని ఆనాటి ముఖ్యమంత్రి చెప్పాడు..
మన ప్రభుత్వం 30 నెలల్లో 90 వేల కోట్ల రూపాయలను వరి రైతుల ఖాతాల్లో వేసి రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం..
సన్న వడ్లు పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ ఇచ్చాం..
ముప్పై రెండు నెలల్లో ఉచిత విద్యుత్ కోసం 30 వేల కోట్లు ఖర్చు చేశాం..
ముప్పై నెలలో 70 లక్షల రైతుల కుటుంబాలకు 1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం.
చేతనైతే తండ్రి, కొడుకు, అల్లుడు అసెంబ్లీకి వస్తే లెక్కలు తేల్చుదాం..
అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం..
ఆడబిడ్డలు అమ్మవారింటికి పోయినా, అమ్మవారిని దర్శించుకున్నా బస్సు కిరాయి లేదు..
11 వేల కోట్ల రూపాయలను ఆర్టీసీ కి ప్రభుత్వం చెల్లించి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది..
ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం ఇవ్వాలని ఏ నాడైనా కేసీఆర్ అనుకున్నాడా..?
బస్సులో ఉచితంగా పోతుంటే కడుపు మండి హైదారాబాద్ లో ఆటో కార్మికులను రెచ్చగొట్టి దరిద్రుడు ధర్నా పెట్టించాడు..
ఆడబిడ్డలకు ఇచ్చిన మాట తప్పేదే లేదని ఆటో డ్రైవర్లకు చెప్పాడు..
ఇందిరమ్మ రాజ్యం ఉన్నన్ని రోజులు ఉచిత ప్రయాణం ఉంటుంది..
ఆడబిడ్డలకు 1000 బస్సులు కొచ్చి ఆర్టీసీకి కిరాయికి ఇచ్చి నెలకు 70 వేల అద్దె వచ్చేలా చేశాం..
పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ అంటే అదానీ, అంబానీలే గుర్తుకు వస్తారు..
1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు మహిళా సంఘాలతో పెట్టించాం..
ఆడబిడ్డలతో పెట్రోల్ బంకులు పెట్టిస్తున్నాం..
హైటెక్ సిటీ పక్కన 1000 కోట్ల రూపాయల విలువ చేసే మూడున్నర ఎకరాల స్థలంలో మహిళా సంఘాలు తమ ఉత్పత్తులు అమ్ముకునేలా ఇందిరా మహిళా శక్తి స్టాల్స్ పెట్టించాం..
2034 నాటికి కోటీ మంది ఆడబిడ్డలకు కోటీశ్వరులను చేయాలని ప్రతి వ్యాపారంలో అవకాశం కల్పిస్తున్నాం..
బడి పిల్లల బట్టలు కుట్టే వ్యాపారం ఆడబిడ్డలకు ఇచ్చాం..
అమ్మ ఆదర్శ పాఠశాలను కూడా ఆడబిడ్డలకు ఇచ్చాం..
67 లక్షల మహిళా సంఘాలకు ఆర్థికంగా అడ్డంగా నిలుస్తున్నాం..
కేసీఆర్ ఏ నాడైనా ఆడబిడ్డలను పట్టించుకున్నాడా..?
తెలంగాణ ఉద్యమం అంటేనే నిరుద్యోగ యువత..
కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీలు నుంచి విద్యార్థులు కొట్లాడారు..
యువత ఆత్మబలిదానం చేసుకుంటే తెలంగాణ వచ్చింది..
పదేళ్లలో శ్రీకాంతాచారి కుటుంబాన్ని పిలిచి బుక్కెడు బువ్వ పెట్టాడా..?
పిల్లి ఎన్ని శాపనార్థాలు పెట్టినా ఉట్టి తెగిపడుతుందా..?
ఫామ్ హౌస్ లో ఉన్నోడు, ఊరూరు తిరుగుతున్న వాళ్లు ప్రభుత్వాన్ని తిరుడుతున్నారు..
ప్రశ్నాపత్రాలను పల్లీ బఠానీల్లా అమ్ముకుని నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమడారు..
ప్రజా పాలన రావాలి, పాపాల భైరవుడు రావాలని దీక్ష చేస్తున్నారు.. రోడ్లపై తిరుగుతున్నారు..
రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలు ఇచ్చాం..
ఒక వైపు రైతు, మరో వైపు మహిళలు, విద్యార్థులు, ఉద్యమకారులను ఆదుకోవడానికి పని చేస్తున్నాం..
కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆయన అంటున్నాడు..
కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే హరీష్ రావును, కేటీఆర్ ను మంత్రులను చేశారు..
రేవంత్ రెడ్డి సీఎం అయితే సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ను మంత్రి చేశాం..
కేసీఆర్ సీఎం అయితే సంతోష్ రావు ను ఎంపీ చేశాడు..
నేను చామల కిరణ్ ను ఎంపీ చేశాను..
కేసీఆర్ సీఎం అయితే వినోద్ రావు ను ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ , కవిత ను ఎమ్మెల్సీ చేశాడు...
నేను సీఎం అయితే శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, సత్యం ను ఎమ్మెల్సీ చేశాం..
నల్గొండ జిల్లాకు మొదటి సారి ప్రజా పాలనలో ముగ్గరికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం..
కేసీఆర్ తన బిడ్డలకు, బంధువులకు ఉద్యోగాలు ఇస్తే మేం శంకరమ్మ ను, చాకలి ఐలమ్మ మనమరాలి కి పదవులు ఇచ్చాం..
రేవంత్ రెడ్డి సీఎం అయితే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, జ్యోతిరావు పూల్ విగ్రహాలు వచ్చాయి..
కేసీఆర్ తన కొడుకు కేటీఆర్ ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేశాడు.
రేవంత్ రెడ్డి సీఎం అయితే బలహీన వర్గాల బిడ్డ మహేష్ కుమార్ గౌడ్ ను పీసీసీ అధ్యక్షుడిని చేశాం..
కేసీఆర్ హయాంలో పేదోళ్ల బిడ్డలకు పదవులు వచ్చాయా..?
కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే పేపర్ ,టీవీ, ఫామ్ హౌస్ , దోచుకోవడానికి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చాడు..
అందుకే కాకుల్లా రాష్ట్రం మీద పడి మాట్లాడుతున్నారు..



ప్రజా పాలన పేదలు, ఆడబిడ్డలు,ఉద్యమకారుల కోసం పనిచేస్తుంది..
ప్రభుత్వం వచ్చాక ఒక కోటీ ఆరు లక్షల రేషన్ కార్డులకు మూడు కోట్ల నలభై ఎనిమిది లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం..
బీఆర్ఎస్ వాళ్లకు కూడా సన్న బియ్యం ఇస్తున్నాం..
50 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..
బీఆర్ఎస్ కార్యకర్తలు పండించిన వడ్లు మేం కొనలేదా..?
బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు భరోసా తీసుకోలేదా..? ఎవరైనా వద్దన్నారా..?
ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచలేదా..?
ఇన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినందుకు ఇందిరమ్మ పాలన పోవాలా..?
రేవంత్ రెడ్డికి చదువు వస్తదో రాదో కాని సంస్కారం ఉంది..
సంస్కారం లేకపోతే ఒక్కడు కూడా రోడ్డు మీద కాలు పెట్టడు.. ఫామ్ హౌస్ లో పడుకోవాలి..
సంస్కారం ఉంది కాబట్టే సీతక్క, కొండా సురేఖ ను ఇంట్లోకి పిలిచి రాఖీ కట్టించుకున్న..
సొంత చెల్లిని మెడ పట్టి ఆస్తి కోసం బయటకు నెట్టిన గాడిద ..నీకు నాకు పోలికనా..?
గుంటూరు తెలివి తేటలు అన్ని చూపిస్తున్నాడు..
గుంటూరులో చదువుకున్న కేటీఆర్ చెప్రాసీ నౌకరి కూడా ఇవ్వడానికి లేదు..
బందిపోట్ల ముఠాను మొత్తం తీసుకువచ్చి తెలంగాణను బందిపోట్లలా దోచుకున్నారు..
అసెంబ్లీకి రా.. మాట్లాడుదాం... నీ సంస్కారం ఏమిటో, నీ చదువు ఏమిటో
మర్యాదగా ఉంటే చేతకాని తనం అనుకుంటున్నారు..
సంస్కారం ఉన్న కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ నాయకత్వంలో ఆడబిడ్డలను
కేసీఆర్ బిడ్డ తీహార్ జైలు నుంచి ఇంటికిపోతే ఆస్తి లో వాటా ఇవ్వాల్సి వస్తుందని కేటీఆర్ ఇంట్లో నుంచి బయటకు గెంటేశాడు..
పార్టీ నుంచి సస్పెండ్ చేశాడు.. ఇలాంటోడు కోటీ మంది ఆడబిడ్డల బాగోగులు చూస్తాడా..?
సొంత చెల్లికి అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా..?
పుట్టింటికి ఆడబిడ్డ వస్తే ఇంట్లోకి పిలిచి ఇంత అన్నం పెడతారు..
సొంత చెల్లి ని ఇంట్లో నుంచి బయటకు నెడితే కొడుకును మందలించకుండా కేసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నాడు..
ఏ విషయమైన అసెంబ్లీలో చర్చించడానికి మేం సిద్ధం..
అసెంబ్లీకి రావాల్సిందే..
365 రోజులు ఉద్యోగానికి రాకపోతే ఉద్యోగస్తులను బర్తరఫ్ చేస్తారు..
22 కోట్ల 24 లక్షల 40 వేల రూపాయలను ప్రభుత్వం నుంచి తీసుకున్న కేసీఆర్ ఒక్క రోజు కూడా బయటకు రాలేదు..
డిస్మిస్ చేయాలా వద్దా..?
కేసీఆర్ తీసుకున్న జీతం పేద ప్రజలు కట్టిన పన్నులు కాదా..?
మీదంతా గతమే.. భవిష్యత్తు లేదు.. మీది చీకటిమయం.. తెలంగాణ తులసీవనంలో గంజాయి మొక్కలను పీకుతాం..
బీఆర్ఎస్ మొక్క ను మొలవనివ్వం..
సిరిసిల్ల, గజ్వేల్ లో కూడా కాంగ్రెస్ గెలుస్తుంది..
ఈ నెలాఖరున సిరిసిల్ల పోదాం.. అంతా రండి.. నెలాఖరుకు సిరిసిల్ల వస్తా.. కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం.. తర్వాత సిద్దిపేట వస్తా..
ఎవరి ని తెచ్చుకుంటారో తెచ్చుకోండి సిరిసిల్ల, సిద్దిపేటలో తేల్చుకుందాం..
కల్వకుంట్ల కుటుంబం కాసుకో..
ఈట్ కా జవాబ్ పత్తర్ సే దేంగే.
వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందాం.. కేసీఆర్..
సీట్లు పెరిగితే 117 .. ఉన్న సీట్లే ఉంటే 90 సీట్లతో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం..
పదేళ్లు మా ప్రభుత్వమే..
2024 నుంచి 2034 వరకు రెండు సార్లు ఇందిరమ్మ రాజ్యం ఉంటుంది..
కేసీఆర్ సిద్ధంగా ఉంటు.. అసెంబ్లీకి రా..
లేకుంటే గౌరవంగా రాజీనామా చేయి..గజ్వేల్ లో తేల్చుకుందాం..

## బొడ్డు పోతరాజు మృతికి నివాళులు అర్పించిన జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు ..



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 05 ఏటూరు నాగారం** మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకుఏటూరునాగారం మండలం షాపల్లి గ్రామానికి చెందిన బొడ్డు పోతరాజు (58) అనారోగ్య కారణాలతో మృతి చెందారు.. విషయం తెలుసుకున్న ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు వెంటనే షాపల్లి గ్రామానికి చేరుకుని పోతరాజు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే పోతరాజు అంత్యక్రియల్లో పాల్గొన్నారు...ఈ కార్యక్రమంలో షాపల్లి సర్పంచ్ రామదేని రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేల వినయ్, జిల్లా యూత్ కార్యదర్శి ఎండీ గౌస్, యాలం శంకరమ్మ, యాలం ప్రశాంత్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, కుక్కల రాములు, కిరాణా వెంకటేష్, యాలం నారాయణ, గొంది గౌరక్క, జరుపుల అమృత, సమ్మక్క, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

## ఒంగోలులో యాక్సిడెంట్.. ఇద్దరు పల్నాడు మహిళలు మృతి



ఒంగోలు సంఘమిత్ర ఫ్లైఓవర్ పై శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది.విజయవాడ నుంచి నెల్లూరు వెళుతూ మరమ్మతుల నిమిత్తం ఆగి ఉన్న లారిని మరొక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. లారీలో ఉన్న డ్రైవర్ కిందకి దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొట్టిన వాహనంలో ఇద్దరు మహిళలు ఇరుక్కుని మృతి చెందారు. మృతులు అమరావతి మండలం దిడుగు గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ(27), తిరుపతమ్మ (24)గా పోలీసులు గుర్తించారు

## సుదీర్ఘ పాదయాత్రకు జగన్



కడప, సెప్టెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు. 2017లో జగన్ ఒక నవ నాయకుడిగా , అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది. అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి. జగన్ పాదయాత్ర ప్రారంభించేనాటికే కౌంటర్ వ్యూహాలతో, ముఖ్యంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, క్షేత్రస్థాయి సంక్షేమ ఫలాలను వేగవంతం చేయడం ద్వారా జగన్ పాదయాత్ర మైలేజ్‌ను తగ్గించడానికి కూటమి నాయకత్వం ప్రయత్నిస్తుంది. పైగా, జగన్ పాదయాత్ర వెళ్లే మార్గాల్లో ఎదురయ్యే ప్రజా నిలదీతలను తిప్పికొట్టడం వైసీపీ కేడర్‌కు పరీక్షగా మారనుంది. దీనికితోడు వైసీపీలో ఉన్న ప్రధాన లోపం ద్వితీయ శ్రేణి నాయకత్వం వికేంద్రీకరణ . ఒకప్పుడు జగన్ వెనక నడిచిన సీనియర్ నేతలలో కొందరు నిశ్శబ్దంగా ఉండటం, మరికొందరు పార్టీ వీడటం వల్ల క్షేత్రస్థాయి యంత్రాంగం బలహీనపడింది. కేవలం జగన్ ఇమేజ్ మీదనే మళ్లీ గెలవడం కష్టమని, బలమైన నియోజకవర్గ స్థాయి నేతలు లేకపోతే పాదయాత్ర తెచ్చిపెట్టే ఉత్సాహం ఓట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం ఉంది. కేడర్‌లో మళ్లీ జోష్ నింపడం, నైరాశ్యంలో ఉన్న నేతలకు భరోసా ఇవ్వడం జగన్ ముందున్న తక్షణ కర్తవ్యం. ప్రతీసారి పాదయాత్ర ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తుందనుకోవడం పొరపాటే.

# ఖమ్మంలో హోరెత్తిన బీఆర్ఎస్ యువత పోరుబాట.

**కదం తొక్కిన బీఆర్ఎస్ యువత...**
**పాల్గొన్న మాజీ ఎంపీ నామ, మాజీ మంత్రి పువ్వాడ**
**సమాజంలోని అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది...**
**రైతుల ఖాతాల్లో లక్ష కోట్ల రూపాయలు వేసిన ఘనత కేసీఆర్ కు దక్కుతుంది...**
**యువత, విద్యార్థి లోకాన్ని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**
**కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
**జెన్ జీ యువత ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి**
**తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై విమర్శలు అర్థరహితం**
**ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదు?**





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 5:**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అబద్ధపు మాటలు చెప్పి, అలవికాని హామీలు, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి కేసీఆర్ గారిని ఓడించలేమని భావించి, ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీని కూడా తెలంగాణకు తీసుకొచ్చి ఆయనతో సైతం చెప్పించి సమాజంలోని అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ యువత పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఖమ్మం నగరం, మధిర అసెంబ్లీ నియోజకవర్గం చింతకాని మండలం నాగులవంచలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత, విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. భారతదేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లా ఏ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేయలేదని పేర్కొన్నారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే నిరుద్యోగుల పట్ల వివక్ష చూపారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మూడేళ్ల పాలనలో ఆరు లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, కానీ ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని మండిపడ్డారు. తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను చదివిస్తే, ఈ రోజు యువతకు ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ప్రతి నెలా మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, 33 నెలలకు రూ.82,500 బకాయి ఉన్నారని, దివ్యాంగులకు రూ.6,000 ఇస్తామని హామీ ఇచ్చి రూ.66,000 బకాయి ఉన్నారని అన్నారు. ఆడపిల్లలకు ఉచిత స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీని కూడా నెరవేర్చలేదని పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నేరుగా రైతుల ఖాతాల్లో లక్ష కోట్ల రూపాయలు జమ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతే రాజుగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, రైతుబీమా, రైతు కూలీల విషయం, పంట కొనుగోళ్లు, ఎరువుల విషయంలో తీవ్రంగా మోసం చేసిందని ఆరోపించారు.

నాడు పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఇబ్బంది పడకుండా ఉండాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల గురించి 17వ లోక్‌సభలో మాట్లాడితే పార్లమెంట్‌లో అందరూ ఆశ్చర్యపోయారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలకు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని, ప్రస్తుతం ఆ పథకాలను కూడా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇటీవల జెన్ జీ యువత పార్లమెంట్ సాక్షిగా ఉద్యమం చేస్తే కేంద్రం దిగివచ్చిందని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా రానున్న రోజుల్లో యువత గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పరిపాలన చేతకాక తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై విమర్శలు చేయడం చాలా బాధగా అనిపిస్తోందన్నారు. స్వాతంత్ర్యం కోసం నాడు గాంధీ చేసిన పోరాటం మాదిరిగా, కాంగ్రెస్ పాలిస్తున్న సమయంలో కేసీఆర్, ఉద్యమకారులు, సకల జనుల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. తాను కూడా 15వ లోక్‌సభలో కేసీఆర్‌తో కలిసి పార్టీలకు అతీతంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన విషయాన్ని, పార్లమెంట్‌ను స్తంభింపజేసిన సందర్భాన్ని మరోమారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటి కేసీఆర్‌పై నిజమైన తెలంగాణవాదులు ఎవరూ విమర్శలు చేయరని, కనీసం మాట కూడా అనలేరని పేర్కొన్నారు. తెలంగాణ యువత ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామాల్లో చర్చ పెట్టాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ శ్రేణులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

# నేను సైతం చేయూత - విద్యా యాత్ర

**మన - మన బడి**
**ఐదు మండలాల్లో ఘనంగా గురుపూజోత్సవం**
**- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**
**పాల్గొన్న అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ**

**చంద్రుగొండ సెప్టెంబర్ 5 ప్రజాబలం ప్రతినిధి** :–అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యారంగ పరిరక్షణకు, విద్యాభివృద్ధికి శ్రీకారం చుడుతూ "నేను సైతం చేయూత" కార్యక్రమంలో భాగంగా "విద్యా యాత్ర: మన ఎమ్మెల్యే - మన బడి" అనే నూతన కార్యక్రమాన్ని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణలి వేడుకగా ప్రారంభించి నిర్వహించారు. ఈ విద్యా యాత్రలో భాగంగా చంద్రుగొండ, అన్నపరెడ్డిపల్లి, ములకలపల్లి, దమ్మపేట మరియు అశ్వారావుపేట మండలాల విద్యాశాఖల సంయుక్త





ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం) వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో విశేష సేవలందించిన ఐదు మండలాల ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ --- "విద్య అనేది కేవలం పుస్తకాల్లోని జ్ఞానం మాత్రమే కాదు; అది జీవితాన్ని ప్రభావితం చేస్తుంది, సమాజాన్ని పునర్నిర్మించే మహత్తర శక్తి" అని స్పష్టం చేశారు. సమాజ పురోగతికి, వ్యక్తుల సమగ్ర వికాసానికి విద్య అత్యంత కీలకమైన పునాది అని పేర్కొంటూ విద్య యొక్క ప్రయోజనాలను వివరించారు. విద్య మనిషికి మంచి-చెడులను విచక్షించే ఆలోచనా శక్తిని, సమాజంలో ధైర్యంగా జీవించే ఆత్మవిశ్వాసాన్ని అందిస్తూ క్రమశిక్షణ, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలతో కూడిన వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. అలాగే నాణ్యమైన విద్య మంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాలను తెచ్చిపెట్టి ఉన్నత శిఖరాలను చేరుకునే దిశగా, కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి శక్తివంతమైన సాధనంగా మారుతుందని తెలిపారు. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు.

అంతేకాకుండా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ బలోపేతానికి, విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల సమగ్ర సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థుల కోసం 'అమ్మ ఆదర్శ పాఠశాలల' ద్వారా బడుల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఉచితంగా రెండు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు మరియు నోట్‌బుక్స్‌ను అందజేసిందన్నారు. అలాగే పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల, సివిల్స్ ప్రిలిమ్స్ సాధించిన అభ్యర్థులకు 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయం' కింద రూ.1,00,000 ఆర్థిక సాయం మరియు గురుకులాల్లో మెస్, డైట్ ఛార్జీల పెంపు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. మరోవైపు ఉపాధ్యాయ రంగానికి సంబంధించి 11,062 పోస్టులతో 'మెగా డీఎస్సీ ' ద్వారా వేగంగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేయడం, ఏళ్లేళ్లుగా నిలిచిపోయిన టీచర్ల ప్రమోషన్లు, పారదర్శక బదిలీల ప్రక్రియను పూర్తి చేయడం, భాషా పండితులు మరియు పి ఈ టి పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయడం, మరియు సమగ్ర శిక్షా సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విద్యాశాఖలో మెరుగైన వాతావరణాన్ని కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ( ఎంఈఓ స్ ), సర్పంచులు,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం నిర్వహణకు పటిష్ట బందోబస్తు

**రౌడీషీటర్లపై నిరంతరం నిఘా**
**వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 5:**రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

శనివారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..గణేష్ ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, ప్రతి మండపం వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను ముందుగానే పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ ప్రాంతాల్లో తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు.

విగ్రహాల ఊరేగింపులో డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి పాల్గొనడం వంటి వాటిపై నిఘా ఉంచాలన్నారు. గణేష్ ఉత్సవాలను




శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, గణేష్ మండపాల నిర్వాహకులతో వేరువేరుగా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

రౌడీషీటర్ల ప్రస్తుత కార్యకలాపాలు, కదలికలు, వారి పరిచయాలు, వివాదాలకు సంబంధించిన అంశాలపై స్థానిక పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పండుగలు, ఉత్సవాలు, ముఖ్యమైన కార్యక్రమాల సందర్భంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రౌడీషీటర్ల కదలికలను పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వారిని ఉపేక్షించకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# సెప్టెంబర్ 9వ తేదీ లోపు ఇరాన్‌పై దాడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5, (న్యూస్ పల్స్) ఇరాన్‌పై పునఃప్రారంభించిన సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంటున్నారు. అయితే, అవసరమైతే అమెరికా మళ్లీ దాడి చేయవచ్చని ఆయన హెచ్చరిక కూడా జారీ చేశారు. ఈ రెండు అంశాలు ఒక అతిపెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి:ఇరాన్ జాతకం, వార్షిక అంచనాలు, రాబోయే ఆరు రోజుల పంచాంగాన్ని పరిశీలిస్తే, ప్రమాదం ఇంకా తొలగిపోలేదు. సెప్టెంబర్ 6, 8 తేదీలు ముఖ్యంగా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. అయితే, దీనిని దాడి కచ్చితంగా జరుగుతుందని చెప్పే అంచనాగా పరిగణించలేము. ఈ తేదీలలో జరిగే ఏ సైనిక చర్య అయినా, ప్రతీకార దాడి అయినా, నౌకకు సంబంధించిన సంఘటన అయినా, లేదా సాంకేతిక వైఫల్యం అయినా ఉద్రిక్తతలను పెంచవచ్చు.ఇరాన్‌పై అమెరికా చేపట్టిన కొత్త సైనిక చర్య ఎక్కువ కాలం కొనసాగదని సెప్టెంబర్ 2న ట్రంప్ అన్నారు. హోర్ముజ్ సమీపంలో అమెరికా సైన్యం ఇరాన్ రాడార్, క్షిపణి వ్యవస్థలు, సముద్ర మైన్లు అమర్చే పరికరాలను ధ్వంసం చేసిందని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఎప్పుడైనా మరో దాడిని ప్రారంభించవచ్చని ట్రంప్ కూడా పేర్కొన్నారు. దీని అర్థం, సైనిక చర్యను నిలిపివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. మరో దాడి జరుగుతుందా లేదా అనేది ఇరాన్ ప్రతిస్పందన ,హోర్ముజ్‌లోని పరిస్థితిపై ఆధారపడి ఉంటుందిఅమెరికా జరిపిన తాజా దాడులతో ఇరాన్ జోర్డాన్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లలోని అమెరికా స్థావరాలు, ప్రయోజనాల వైపు క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించింది. ఈ దాడులలో పలువురిని గగనతలంలోనే అడ్డుకున్నట్లు ఆ దేశం ప్రకటించింది. అమెరికా దాడుల్లో 18 మంది మరణించారని, 108 మంది గాయపడ్డారని ఇరాన్ పేర్కొంది.

# విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించేలా విద్యను అందించాలి.

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**మార్కుల కంటే సంస్కారం, సత్యం, నైతిక విలువలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది**

**ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను శాశ్వతంగా మార్చగలరు**

**131 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**గురుపూజోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**ఖమ్మం జిల్లా బ్యూరో సెప్టెంబర్05 ప్రజాబలం:**విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శనివారం స్థానిక శ్రీ భక్త రామదాసు కళా క్షేత్రంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో



జిల్లా కలెక్టర్ పాల్గొని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. “ఉపాధ్యాయులు పిల్లల జీవితాలను శాశ్వతంగా మార్చగలరని, మనం ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా మన గురువుల పట్ల ఉండే గౌరవం ఎప్పటికీ అలాగే ఉంటుంది” అని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలామంది మొదటి తరం విద్యార్థులేనని, అలాంటి పిల్లలకు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పాత్రను కూడా పోషించాలని సూచించారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు విద్యతో పాటు మంచి నడవడిక, విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

వివేకం లేని విద్య శూన్యం. మార్కుల కంటే సంస్కారం ముఖ్యమని, పెద్దలను గౌరవించడం, సత్యం కోసం నిలబడటం, నైతిక విలువలను పాటించడం వంటి విలువలను విద్యార్థులకు బోధించాలి” అని కలెక్టర్ పేర్కొన్నారు.

తన విద్యాభ్యాసంలో ఉపాధ్యాయుల పాత్రను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తనకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు బోధించిన టీచర్ తనకు ఎలాంటి ఫీజు తీసుకోకుండా విద్యాబోధన చేయడంతో పాటు, ఆ సమయంలో వారు అందించిన ప్రోత్సాహం, మద్దతు తనను ఈ స్థాయికి తీసుకువచ్చేందుకు దోహదపడిందని భావోద్వేగంతో తెలిపారు.

సమాజంలో ప్రస్తుతం అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, గతంలో ఉపాధ్యాయులు ఏదైనా మందలించినా అది తమ మంచికేనని విద్యార్థులు, తల్లిదండ్రులు భావించేవారని కలెక్టర్ అన్నారు. ఇంట్లో కూడా ఉపాధ్యాయులను దేవుని రూపంగా గౌరవించేవారని గుర్తు చేశారు. ఇటీవల నల్గొండ జిల్లాలో జరిగిన సంఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

మంచి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.ఇల్లు మొదటి పాఠశాల అని, ఇల్లు, పాఠశాలలోని వాతావరణమే పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది అని తెలిపారు.

తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ, ఉపాధ్యాయుని పట్ల తనకున్న గౌరవం కారణంగా తనకు అంతగా ఇష్టం లేని సోషల్ సబ్జెక్టు తర్వాత తనకు ఇష్టమైన సబ్జెక్టుగా మారిందన్నారు.



పిల్లలను మంచి మార్గంలో తీర్చిదిద్దే ప్రయత్నంలో ఎప్పుడూ ఆశను వదులుకోకూడదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశావాహ దృక్పథంతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రతి ఉపాధ్యాయుడూ ఉత్తముడేనని, అయితే ఈ రోజు ఉత్తమ ఉపాధ్యాయు లుగా గుర్తింపు పొందిన వారికి లభించిన గౌరవం ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అభినందించారు. కోవిడ్ అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా మారి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగినప్పటికీ, 90 కి పైగా ప్రైవేట్ పాఠశాలలు ముందుకు వచ్చి బెస్ట్ అవైలబుల్ స్కూల్ విధానంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు సహకరించాయని తెలిపారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు.

ఇంచార్జీ జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగిందన్నారు. ఎఫ్ఆర్ఎస్ అమలులో ఖమ్మం జిల్లా ముందంజలో ఉందని, పదవ తరగతి ఫలితాలు కూడా మెరుగ్గా వచ్చాయని తెలిపారు. విద్యా ప్రమాణాల్లో జిల్లా మంచి పనితీరు కనబరుస్తోందని, ఈ ఏడాది ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ జిల్లాలోని 131 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

## TGEJAC హైదరాబాద్ సిటీ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో సన్నాహక సభలు -- చైర్మన్ కట్కూరి శ్రీకాంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 5, 2026:తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGEJAC) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10, 2026న నిర్వహించనున్న “చలో హైదరాబాద్ -- మహా ధర్నా” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ు+జుజీూజ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

ఈ పిలుపు మేరకు TGEJAC హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సన్నాహక సభలు నిర్వహించారు. ముఖ్యంగా:

1. ప్రభుత్వ పుస్తక ముద్రణ శాఖ
2. టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖ
3. కాలేజియేట్ ఎడ్యుకేషన్ శాఖ
4. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శాఖ

ఈ శాఖల్లో నిర్వహించిన సన్నాహక సభల్లో ఉద్యోగులకు చలో హైదరాబాద్ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కార్యోన్ముఖులను చేశారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.




ఈ సందర్భంగా TGEJAC హైదరాబాద్ సిటీ చైర్మన్ శ్రీ కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల ఐక్యత, సంఘటిత పోరాటంతోనే న్యాయమైన డిమాండ్లను సాధించుకోగలమని తెలిపారు.ఈ సందర్భంగా పంతులు హరికృష్ణ, నాగిరెడ్డి, చందు, ప్రవీణ్, స్వామి, ప్రవీణ్ తదితరులు మాట్లాడుతూ, TGE-JAC రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ నాయకత్వంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఉద్యోగులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కన్వీనర్ కృష్ణ యాదవ్, ఫైనాన్స్ సెక్రటరీ హరికృష్ణ పంతులు, ఫైనాన్స్ సెక్రటరీ కుర్రాడి శ్రీను ఆధ్వర్యంలో కృష్ణస్వామి, దీపక్, ప్రవీణ్, స్వస్తిత, రఘు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.అనంతరం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన “ఉద్యోగ పోరుబాట” గీతాన్ని ఆలకించి ఉద్యోగులు ఉత్తేజం పొందారు.

# కేబినెట్ బెర్తుల భర్తీ ఎప్పుడు

హైదరాబాద్, సెప్టెంబర్ 5 తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో అత్యంత కీలకమైన రాజకీయ ఘట్టానికి తెరలేపుతోంది. మంత్రివర్గంలో మార్పుచేర్పులు ,ఖాళీల భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి తుది అనుమతి లభించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగియగానే ఈ విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ పరిణామం కేవలం పదవుల పెంపకానికే పరిమితం కాకుండా, పార్టీపై , పాలనపై సీఎం తన పట్టును మరింత బిగించే ప్రక్రియగా కనిపిస్తోంది.ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో సాంకేతికంగా ఖాళీలు ఏర్పడగా, కొండా సురేఖ బర్తరఫ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రాతినిధ్యంతో పాటు బీసీ మహిళా స్థానం ఖాళీ అయింది. అంటే ప్రస్తుతం మూడు ఖాళీలు ఉన్నాయి. దీంతో పాటు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రాతినిధ్యాన్ని కల్పించడం సీఎం రేవంత్ ముందున్న ప్రధాన లక్ష్యం. మూడేసి ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, పనితీరు సరిగ్గా లేని కొంతమంది మంత్రుల శాఖలను మార్చడం లేదా వారి స్థానంలో నూతన ముఖాలకు అవకాశం కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రణాళిక సిద్ధమైంది.కొండా సురేఖను తప్పించిన వెంటనే, నష్ట నివారణ చర్యల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ముగ్గురు కీలక బీసీ మహిళా నేతలకు ఉన్నతమైన నామినేటెడ్ పదవులను కట్టబెట్టడం ద్వారా తన సామాజిక వ్యూహాన్ని చాటుకున్నారు. కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మి , మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద , కుడా ఛైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి లను నియమించడం ద్వారా బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశామనే సంకేతాన్ని పంపించారు. ఇదే సూత్రాన్ని రాబోయే కేబినెట్ భర్తీలోనూ పాటిస్తూ ఒక బీసీ మహిళకు మంత్రిపీఠం దక్కేలా రేవంత్ ప్రణాళికలు రచిస్తున్నారు.మరోవైపు, పాత కాంగ్రెస్ నేతలు , కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల మధ్య సమన్వయం పాటించడం ఈ కేబినెట్ విస్తరణలో రేవంత్ రెడ్డికి ఎదురుకానున్న పెద్ద పరీక్ష. పార్టీ కోసం మొదటి నుంచీ కష్టపడిన సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. అధిష్టానంతో ఉన్న సత్సంబంధాలను ఉపయోగిస్తూ ఢిల్లీ స్థాయిలో పావులు కదుపుతున్నారు. అయితే, మంత్రివర్గంలో కేవలం రాజకీయ సమీకరణాలే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు మరియు మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి ఉపయోగపడే డైనమిక్ నాయకులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ విస్తరణ ద్వారా రేవంత్ రెడ్డి కేవలం ఖాళీలను పూరించడమే కాకుండా, పనితీరు సరిగ్గా లేని మంత్రులకు హెచ్చరిక పంపేలా పెర్ఫార్మెన్స్ బేస్డ్ ప్రక్షాళన చేయనున్నారు. ఐటీ, రెవెన్యూ, నీటిపారుదల వంటి కీలక శాఖలు తప్ప మిగిలిన శాఖల్లో పనితీరును సమీక్షించి, సమర్థులైన అధికారులకు మరియు మంత్రులకు తగిన రీతిలో పోర్ట్‌ఫోలియోలను పునర్విభజించే అవకాశం ఉంది. ఈ దిశగా ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు కూడా పూర్తవ్వడం పాలనాపరమైన మార్పులకు సంకేతంగా నిలుస్తోంది.రాబోయే కేబినెట్ విస్తరణ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఒక రకమైన పొలిటికల్ రీసెట్ కాబోతోంది. అంతర్గత అసమ్మతికి తావులేకుండా, సామాజిక న్యాయాన్ని కాపాడుతూ, నామినేటెడ్ పదవులు , కేబినెట్ బెర్త్‌లను ఒకేసారి భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వంపై మరియు కాంగ్రెస్ క్యాడర్‌పై తన అజమాయిషీని రేవంత్ రెడ్డి మరోసారి నిరూపించుకోనున్నారు.

# నేపాల్కు మరో ముప్పు

## చౌలానీ నదిని అడ్డుకున్న భారీ కొండచరియలు

ఖట్మాండూ నేపాల్లోని దార్చులా జిల్లాలోని అపిహిమాల్ ప్రాంతం భట్టార్ వద్ద భారీ కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహం పాక్షికంగా అడ్డంకికి గురైంది.

కొండచరియలు ఇంకా విరిగిపడుతున్న నేపథ్యంలో.. నది పూర్తిగా అడ్డుకుపోయి ఒక్కసారిగా భారీగా నీటి ప్రవాహం పెరిగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. దీంతో నదీ తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు. పరిస్థితిని అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే భట్టార్ ప్రాంతంలోని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇక ఇప్పటికే నేపాల్ను కుదిపేసిన త్రిశూలి నది విపత్తు విషాదం నుంచి దేశం ఇంకా కోలుకోకముందే.. మరో నదికి కొండచరియల ముప్పు రావడం ఆందోళన కలిగిస్తోంది. త్రిశూలి విపత్తులో 1,300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. 5,600 మందికి పైగా గల్లంతైనట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు భారీ ప్రాణనష్టం.. మరోవైపు కొత్తగా నదికి అడ్డంకి.. నేపాల్లో ప్రకృతి విపత్తులు వరుసగా కలవరపెడుతున్నాయి.

# 22ఏ అనేది గుంపు మేస్త్రి అనాలోచిత నిర్ణయం

## ఎంపి రఘునందన్ రావు



సంగారెడ్డి పటాన్ చెరు నియోజకవర్గంలోని సింపొని పార్క్ హోమ్స్ కాలనీలో 22 ఏ పై ప్రత్యేక చర్చా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, స్థానిక నాయకులు హాజరయ్యారు. సింపొని పార్క్ హోమ్స్ కు సంబంధించిన 15వందల ఇళ్లను నిషేదిత జాబితాలో పెట్టడంపై కాలనీ వాసుల ఆవేదన వ్యక్తం చేసారు. కాలనీ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు.యం పి రఘునందన్ మాట్లాడుతూ 22ఏ అనేది గుంపు మేస్త్రి అనాలోచిత నిర్ణయం . ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లకు అన్ని అనుమతులున్నా 22ఏ పెట్టడం దుర్మార్గం . అర్ధరాత్రి ఆనాలోచిత నిర్ణయాలకు ఎందరో నాశనమవుతున్నారు. చేసిందంతా చేసి సారీ చెబితే సరిపోతుందా. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి చేసిన పెద్ద తప్పిదం 22ఏ . 22ఏ లో ప్రైవేటు భూములను ఖచ్చితంగా నిషేదిత జాబితాలో నుంచి తీసి వేసేందుకు ప్రయత్నం చేస్తా నని అన్నారు.సింపొని పార్క్ హోమ్స్ కాలనీ లో నెలకున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా. గుంపు మేస్త్రి చేసిన 22ఏ తప్పును సోషల్ మీడియా ద్వారా బహిర్గతం చేసేలా యువతరం పోస్టులు పెట్టండి. కాంగ్రెస్ పాలనలో పేదోడి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయమా . ఏదో చిన్న మాటన్నందుకు కొండా సురేఖ ను బర్తరఫ్ చేస్తే.. పెద్ద తప్పులు చేస్తున్న సీయం రేవంత్ రెడ్డి ని ఎందుకు తీసేయటం లేదు. ప్రభుత్వ దిగి వచ్చే వరకు 22ఏ పై పోరాటం చేయాలని అన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

## గురువులను ఘనంగా సన్మానించిన రామగుండం కార్పొరేషన్ ఏరియా పద్మశాలి సేవా సంఘం

**పెద్దపల్లి/గోదావరిఖని, సెప్టెంబర్ 5, ప్రజాబలం ప్రతినిధి** :ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం కార్పొరేషన్ ఏరియా పద్మశాలి సేవా సంఘం, శివాలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పద్మశాలి సమాజానికి చెందిన గురువులను ఘనంగా సన్మానించారు. స్థానిక మార్కండేయ కాలనీలోని శివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయంగా, ఘనంగా జరిగింది. రామగుండం కార్పొరేషన్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండారి రాయమల్లు, బూర్ల దామోదర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి శివాలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంచికట్ల బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో





కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సంస్కారం అందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పద్మశాలి సమాజానికి చెందిన గురువులను సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. గురువులను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండారి రాయమల్లు, అన్నల్ దాస్ గోవర్ధన్, గడ్డం జానకిరాములు, తౌటం శ్రీనివాస్, కుడిక్యాల సంధ్యారాణి, అనుమాల లక్ష్మీనారాయణ, కుంట రామన్న, గడ్డం సత్యనారాయణ, మంచికట్ల మంజులలను ఘనంగా సన్మానించారు. అలాగే నాట్యరంగంలో ప్రతిభ కనబరుస్తున్న నాట్య మయూరి గుమ్మడి ఉజ్వలను ప్రత్యేకంగా సత్కరించారు. ఆలయ అర్చకులు రాఘవాచార్యులు సన్మాన గ్రహీతలకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నల్ దాస్ శ్రీనివాస్, వడ్డేపల్లి దినేష్, మాటేటి సతీష్, గుండేటి ప్రభాకర్, సాంబారీ రాజేష్, సుంక లక్ష్మీరాజం, కనుగంటి నారాయణ, సత్యనారాయణ, తౌటం శాంతి, వేముల రజిత తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ దేవమ్మ సేవలు మరువలేనివి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



హైద్రాబాద్ సెప్టెంబర్ 5: లక్ష్మీ దేవమ్మ సేవలు మరువలేనివాని మాజీ గవర్నర్ మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. టీచర్స్ డే సందర్భంగా రవీంద్రభారతిలో కీర్తిశేషులు మాజీ మంత్రి మాజీ సిడబ్ల్యుసి సభ్యురాలు లక్ష్మీ దేవమ్మ జ్ఞాపకార్థం మాతృదేవోభవ సత్సంగ్ సావిత్రిబాయి పూలే వెల్ఫేర్ సొసైటీ జెపిఎల్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఏర్పాటుచేసిన టీచర్స్ డే సెలబ్రేషన్స్ కు బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా విచ్చేసి సావిత్రిబాయి శ్రీమతి లక్ష్మీ దేవమ్మ చిత్రపటాలకు నివాళులర్పించి జ్యోతి ప్రజలను చేసి అధ్యాపకులుగా విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధ్యాపకులకు లక్ష్మీదేవమ్మ అవార్డుతో సత్కరించారు

ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శ్రీధర్ కోఆర్డినేటర్ డాక్టర్ అంజనీ దేవి సభాధ్యక్షుడు నందూరి రమేష్ సావిత్రిబాయి పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బెల్లం మాధవి , జె పి ఎల్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు ప్రేమారెడ్డి స్వామీజీలు విజయ స్వామి దంపతులు శ్రీశైలం పూర్వ ట్రస్ట్ మెంబర్ అవధూత కాశిరెడ్డి నాయన శిష్యుడు సీతారామరెడ్డి స్వామి అతిథులుగా కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్ గౌడ్ రాష్ట్ర కార్యదర్శి వీరబొమ్మ రమేష్ రాష్ట్ర టి పి సి సి కార్యదర్శి రాజేందర్ యాదవ్ స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షుడు వందనం రాజు ఐఎన్టియుసి లీడర్ దయానంద్ మిరాకిల్ చిత్ర నిర్మాత సామాజికవేత్త చంద్రం గౌడ్ మోహన్ ట్రస్ట్ అధ్యక్షుడు మోహన్ గాంధీ బిజెపి నాయకులు శ్రీధర్ రెడ్డి మాతృదేవోభవ సత్సంగ్ సభ్యులు చిత్రా పద్మిని సుధాకర్ నవీన్ సరిత హేమంత్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు బ్యాగులు.. పాఠశాలలకు డెస్క్ బెంచ్‌లు

## విద్యాభివృద్ధికి సేవా కార్యక్రమాలు అభినందనీయం: డాక్టర్ మట్టా దయానంద్



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 05:**కీ.శే. దాసరి వీరారెడ్డి, కీ.శే. లక్ష్మీకాంతమ్మల ఆశీస్సులతో, దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టినాయన), దాసరి రాజకుమారి సౌజన్యంతో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ, ప్రభుత్వ పాఠశాలలకు డెస్క్ బెంచ్‌ల వితరణ కార్యక్రమం శనివారం గంగారం శ్రీ దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.

సత్తుపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేయడంతో పాటు, ఆయా పాఠశాలలకు డెస్క్ బెంచ్‌లను అందజేశారు. అలాగే రామగోవిందాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు కూడా బ్యాగులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు దాతలు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో గంగారం కాంగ్రెస్ యువ నాయకులు దాసరి మధుమోహన్ రెడ్డి, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, గంగారం సర్పంచ్ కాకర్ల రేవతి, ఉపసర్పంచ్ బెజవాడ రాధా, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కావేటి అప్పారావు, రామగోవిందాపురం సర్పంచ్ మందపాటి మౌనిక నరేంద్ర రెడ్డి, పాకలగూడెం సర్పంచ్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎంపీపీ దొడ్డ.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్05:**ఏన్కూరు మండలం జన్నారం గ్రామంలో బండి లక్ష్మయ్య కుటుంబంలో వివాహ వేడుకలు అత్యంత వైభవంగా, కోలాహలంగా సాగాయి. తేజశ్రీ, వీరేందర్ ల వివాహం శనివారం రోజున బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఈ శుభకార్యానికి బండి లక్ష్మయ్య వెంకమ్మ దంపతులు ఆహ్వానించగా తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని. ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన బంధువులు, గ్రామీణులు మరియు ఆత్మీయులు. నవ దంపతులు తేజశ్రీ వీరేందర్ లను అక్షింతలు వేసి నిండు నూరేళ్లు సంతోషంగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. కళ్యాణ వేదిక వద్ద బంధుమిత్రుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో అన్నారు గూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, గోపాలపేట ఉప సర్పంచ్ శనక్కాల సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సల్ విద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి సెల్ఫ్ గవర్నమెంట్ సెలబ్రేషన్స్

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 5:**తల్లాడలోని యూనివర్సల్ విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు స్వయంగా ఉపాధ్యాయుల పాత్రలను పోషిస్తూ 'సెల్ఫ్ గవర్నమెంట్ సెలబ్రేషన్స్' నిర్వహించారు. విద్యార్థులే తరగతి గదుల్లో బోధిస్తూ, పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయుల బాధ్యతలను అనుభవించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా సాగింది.

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.



ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాబోధనతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి బెస్ట్ టీచర్ అవార్డులతో సత్కరించారు. ప్రీ ప్రైమరీ సెక్షన్లో బెస్ట్ టీచర్ గా రమ్య, ప్రైమరీ సెక్షన్లో సమత, హై స్కూల్ సెక్షన్లో యాకోబును, బెస్ట్ టీచర్ గా ఎన్నుకున్నారు. వారిని శాలువా కప్పి సత్కరించారు.

వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ పీకే ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, ఉపాధ్యాయులు, రవి, మనిషా ప్రమీల, రోహిణి, సమత , హేమ లావణ్య సిరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 05:**ఉపాధ్యాయులే భావి సమాజ నిర్మాణానికి మార్గదర్శకులని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తొలుత పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి డాక్టర్ మట్టా దయానంద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మెయిన్ రోడ్డులోని రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత సెంటర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.



ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, నైతికతను నేర్పుతూ సమాజానికి మంచి పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని డాక్టర్ మట్టా దయానంద్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలకు సమాజం ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉండాలని అన్నారు.

కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వార్డు కౌన్సిలర్లు, మండల విద్యాశాఖ అధికారి, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల అనుమతులకు సింగిల్ విండో



రంపచోడవరం, వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుకు అనుమతుల కోసం ఇక శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని రంపచోడవరం డీఎస్పీ అశ్రఫ్ అలీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మండపాల అనుమతుల కోసం సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఉత్సవ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అనుమతుల ప్రక్రియను సమన్వయం చేస్తారని తెలిపారు. ఈ అనుమతుల కోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అనుమతి మంజూరైన అనంతరం క్యూఆర్ కోడ్‌తో కూడిన అనుమతి పత్రం అందుబాటులోకి వస్తుందని, దానిని మండపంలో ఉంచాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని డీఎస్పీ అశ్రఫ్ అలీ కోరారు. రాజవొమ్మంగి మండల పరిధిలోని ఉత్సవ కమిటీలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు.

## రేషన్ బియ్యం తరలింపుపై నిఘా అవసరం

### మండల కేంద్రం నుంచి బయటకు వెళ్తున్నట్లు సమాచారం..

### క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి

రాజవొమ్మంగి, రాజవొమ్మంగి మండల పరిధిలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందుతున్న రేషన్ బియ్యం మండల కేంద్రం నుంచి బయట ప్రాంతాలకు తరలుతున్నట్లు సమాచారం అందుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు రేషన్ బియ్యం పంపిణీపై మాత్రమే కాకుండా పంపిణీ అనంతరం బియ్యం ఎటువైపు వెళ్తుందనే అంశంపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బియ్యం అక్రమంగా తరలుతున్నదా.. లేక లబ్ధిదారుల వద్ద నుంచి ఇతర మార్గాల్లో బయటకు వెళ్తున్నదా అనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. రేషన్ బియ్యం సేకరణ, నిల్వ, రవాణా జరుగుతున్న తీరుపై నిఘా పెంచడంతో పాటు అనుమానాస్పద వాహనాలపై తనిఖీలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ రవాణా ఉన్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మండల పరిధి నుంచి రేషన్ బియ్యం తరలింపుపై అందుతున్న సమాచారాన్ని ప్రజా ప్రయోజన దృష్టితో 'ఆంధ్ర సింహం' అధికారుల దృష్టికి తీసుకువస్తోంది. ఈ సమాచారంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

## విద్యార్థి విజయం.. గురువుకు దక్కే అసలైన ప్రతిఫలం

ఒక విద్యార్థి పాఠశాలలో అడుగుపెట్టిన రోజు నుంచి.. అతని భవిష్యత్తు గురించి ఆలోచించే రో వ్యక్తి గురువు. పాఠ్యపుస్తకంలోని విషయాలను బోధించడంతోనే ఆ బాధ్యత పూర్తవదు. విద్యార్థికి అర్థమయ్యేలా చెప్పడం.. సందేహాలను నివృత్తి చేయడం.. తప్పు చేసినప్పుడు సరిదిద్దడం.. వెనుకబడినప్పుడు ప్రోత్సహించడం.. తనపై నమ్మకం కోల్పోయినప్పుడు ధైర్యం చెప్పడం.. ఇలా ప్రతి దశలోనూ గురువు పాత్ర ఉంటుంది. తరగతి గదిలో గడిపే గంటల వెనుక ఎంతో శ్రమ ఉంటుంది. ప్రతి విద్యార్థి ఒకేలా ఉండడు. కొందరు త్వరగా నేర్చుకుంటారు.. మరికొందరికి మరింత సమయం అవసరం. అలాంటి సమయంలో సహనంతో మరోసారి చెప్పడం.. అవసరమైతే ఎన్నిసార్లయినా వివరించడం.. విద్యార్థి అర్థం చేసుకునే వరకు ప్రయత్నించడం గురువు బాధ్యతగా మారుతుంది. తన సమయం, తన అనుభవం, తన శ్రమను విద్యార్థి ఎదుగుదల కోసం వెచ్చిస్తారు. అయితే ఈ కృషికి గురువు ఆశించేది ఏమిటి..? పెద్దగా ఏమీ కాదు. తన దగ్గర చదువుకున్న విద్యార్థి మంచి స్థాయికి చేరుకోవాలి.. జీవితంలో నిలదొక్కుకోవాలి.. సమాజంలో గౌరవంగా జీవించాలి.. అంతే. ఒకప్పుడు తన తరగతి గదిలో కూర్చున్న విద్యార్థి ఒకరోజు ఉన్నత స్థానంలో కనిపిస్తే.. అదే గురువుకు దక్కే నిజమైన ఆనందం. విద్యార్థి సాధించిన విజయంలో తన వంతు చిన్న పాత్ర ఉందని తెలుసుకోవడమే ఆయనకు గొప్ప గుర్తింపు. ఒక విద్యార్థి విజయానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు.. కానీ ఆ విజయానికి తొలి అడుగులు వేయించిన వారిలో గురువు ఒకరు. విద్యార్థి ఎదుగుదలే గురువు కృషికి ప్రతిఫలం.. విద్యార్థి మంచి భవిష్యత్తే గురువు ఆశయం. విద్యార్థుల జీవితాలకు దిశ చూపిస్తూ.. వారి భవిష్యత్తు కోసం నిస్వార్థంగా శ్రమిస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు. సమాజానికి మంచి తరాన్ని అందిస్తున్న గురువులందరికీ వినయపూర్వక వందనం.

## అధికారులు మమ్మల్ని పట్టించుకోండి...

## కమలానగర్ అసోసియేషన్ వాసుల దీనగాథ...

అక్రమ నిర్మాణాలు నిర్మించడమే కాకుండా అందులో హాస్టళ్ళను ఏర్పాటు చేసి తాము ప్రశాంతంగా నివసిస్తున్న ప్రాంతంలో ఇబ్బందులు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కమలానగర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్, లక్ష్మి, కె. శ్రీనివాస్, విజయ్ కాంత్, జ్యోతి లు మాట్లాడుతూ చైతన్యపురి పి ఎస్ పరిధిలోని కమలానగర్ లో కోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా అందులో ప్రైవేట్ హాస్టళ్ళను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు ప్రశాంతంగా జీవిస్తున్న తమ కాలనీ వాసులకు కొత్త కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ ఏరియాలో హాస్టళ్ళను ఏర్పాటు చేసి అందులో ఉండే వారు రాత్రుళ్ళు మద్యం సేవించడం,తమ కాలనీలో నివసించే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్, జి హెచ్ ఎం సి, హైడ్రా, స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని తెలిపారు. కేవలం 140 గజాల స్థలంలో ఆరు అంతస్తుల భవనం నిర్మించారని, గత రెండేళ్లలో జి హెచ్ ఎం సి వారు రెండు సార్లు సీజ్ చేసినా, కోర్టు నిర్మాణం చేపట్టొద్దని ఆదేశించినా తిరిగి మళ్ళీ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రభుత్వం ఇకనైనా అటువంటి అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు హాస్టళ్ళ రూపంలో ఇబ్బందులు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల కొరకు నిరసన ర్యాలీ

## - రావుల శ్రీధర్ రెడ్డి

ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగడతామంటూ మోతీ నగర్ లో సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపు లో జరుగుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా భారీ ర్యాలీ ని చేపట్టారు.ర్యాలీ లో బి.ఆర్.ఎస్ నాయకులు మాజీ సాప్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుండా నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి ఫీజు రియంబర్స్మెంట్ ను బదిలీ చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ చేసే ఈ అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో బహిర్గతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసన ర్యాలీలలో భాగంగా భారీగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థులు తమకు జరిగే అన్యాయాన్ని ఎదురించి విద్యార్థి దశ నుండే పోరాట పటిమ అలవర్చుకోవలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థులకు అన్ని విధాలుగా బిఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు.ఇకనైనా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి భేటీ

హైదరాబాద్ రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్ పర్సన్ గా నూతనంగా నియమితులైన శ్రీమతి గద్వాల్ విజయలక్ష్మి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం ప్రజా భవన్ నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

రాష్ట్ర ప్రణాళికా శాఖాపరమైన అంశాలపై వారు చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టాల్సిన ప్రణాళికలను, రూపొందించాల్సిన కార్యాచరణపై గద్వాల్ విజయలక్ష్మి డిప్యూటీ సీఎం భట్టితో విశ్లేశించారు. ప్రణాళిక శాఖ పరంగా సంపూర్ణ సహకారాన్ని అందించాలని విజయలక్ష్మి డిప్యూటీ సీఎం భట్టిని కోరారు.

## అధ్వానంగా ఓబులవారిపల్లి మండల కేంద్రం



చిట్వేలి ఓబులవారిపల్లి మండల కేంద్రంలో చెత్త కుప్పలు, పందుల బెడద, మురుగు నీటి సమస్యలు, గ్రామంలో విద్యుత్ దీపాలు లేక చీకటిగా మారినా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తుండగా, వాటి చుట్టూ పందుల బెడద రోజురోజుకు పెరిగిపోతోందని ప్రజలు వాపోతున్నారు.పరిశుభ్రత సమస్యతో పాటు పందుల సంచారం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై ఉన్నతాధికారులు ఎన్నో సూచనలు చేస్తున్నప్పటికీ ఓబులవారిపల్లి పంచాయతీలో మాత్రం పరిస్థితి ఎందుకు ఇలా అధ్వానంగా మారిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకులు, పంచాయతీ అధికారులు గ్రామంలోని సమస్యలను పట్టించుకోకపోవడంతోనే పరిస్థితి మరింత దిగజారుతోందని వారు విమర్శిస్తున్నారు. బ్రిడ్జి లోకి వృథాగా కొళాయి నీరు,మరోవైపు రైల్వే స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి వద్ద కొళాయి నీటిని యథేచ్ఛగా వదిలేయడంతో పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కార్యాలయం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బ్రిడ్జి సమీపంలోని హోటళ్లలో భోజనం చేసిన వారు చేతులు రోడ్డుపైనే కడుక్కోవడంతో ఆ మురుగునీరు దుర్వాసనతో పాటు రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు జారిపడే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలోని పారిశుద్ధ్య సమస్యలు, పందుల బెడద, మురుగునీటి నిల్వ, నీటి వృథా వంటి సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు

## అక్రమ సంబంధం నేపథ్యంలో భర్త హత్యకు కుట్ర

## నిందితుడు ఒక టీవీ ఛానల్ రిపోర్టర్

సూర్యాపేట జిల్లా దుబ్బతండాకు చెందిన సతీష్ భార్యతో ఒక టీవీ ఛానల్ రిపోర్టర్ వెంకట్ రెడ్డి వివాహేతర సంబంధం కొనసాగించారని బంధువులు ఆరోపణలు చేస్తున్నారు. తనను అడ్డు తొలగించుకునేందుకు వెంకట్ రెడ్డి, తన భార్య కలిసి కుట్ర పన్నారని సతీష్ ఆరోపిస్తున్నారు. అందుకు సంబంధించిన వీడియో కాల్ రికార్డింగులు, ఆడియో కాల్ రికార్డింగులను సతీష్ మీడియాకు అందించారు. ఆ రికార్డింగులు బయటకు రావడంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. ఈ వ్యవహారంపై గ్రామ పెద్దలు పంచాయతీ నిర్వహించి వెంకట్ రెడ్డితో మాట్లాడినట్లు బాధితుడు చెబుతున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్కు వెళ్లి.. తనతో పాటు గ్రామానికి చెందిన పది మంది పెద్దలపై కేసు నమోదు చేయించారని సతీష్ ఆరోపిస్తున్నారు. తన ఫిర్యాదుపై మాత్రం పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆరోపిస్తున్నారు.ఇదే సమయంలో బిగ్ టీవీ రిపోర్టర్ వెంకట్ రెడ్డి తన కూతురితో అసభ్యంగా ప్రవర్తించారంటూ సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు, తన కూతురికి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి సూర్యాపేట పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. తన కూతురితో అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలపై విచారణ జరిపి.. వాస్తవాలు తేలితే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని సతీష్ డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై హై పవర్ కమిటీ సమావేశం

అమరావతి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, సంక్షేమంపై రాష్ట్రస్థాయి హైపవర్ పర్యవేక్షక కమిటీ సమావేశం అయింది. రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో ఎస్సీ, ఎస్టీల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై హైపవర్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో చర్చ జరిగింది. ? ఎస్సీ, ఎస్టీలకు రక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం నాలుగు అంచెల కార్యాచరణ అమలు, 2026లో ఇప్పటి వరకూ నమోదైన 810 కేసుల్లో మొత్తం కేసులు పరిష్కృతం అయినట్టు అధికారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పరిష్కారానికి 14 స్పెషల్ సెషన్ కోర్టులు, 1 ప్రత్యేక కోర్టు పనిచేస్తున్నట్టు వెల్లడించారు. 2023 నుంచి 2026 ఆగస్టు వరకు 1,478 కేసుల్లో రూ.15.43 కోట్ల పరిహారం అందించినట్టు స్పష్టం చేసారు. ఎ సీ ్స, ఎస్టీల రక్షణకు ప్రత్యేక వ్యవస్థ, రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్తో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి విజిలెన్స్ కమిటీల ఏర్పాటు అయినట్లు వెల్లడించారుజ ఈ సమావేశానికి మంత్రులు డీబీవీ స్వామి, వి.అనిత, జి.సంధ్యారాణి, ఎస్సీ,ఎస్టీ నియోజకవర్గాల ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్, ఎమ్మెల్యేలు, సభ్యులు హాజరయ్యారు. హైపవర్ కమిటీ సమావేశానికి హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, న్యాయశాఖ అధికారులు హాజరయ్యారు.

## మారేడుమిల్లి ఆరణ్య రెసిడెన్సీకి అక్రమ ఎర్రమట్టి తరలింపు..

### అనుమతులు ఉన్నాయా

### సాక్ష్యంతో బట్టబయలైన అక్రమ తవ్వకాల బాగోతం.

### చర్యలు తీసుకోవాలని డిమాండ్

మారేడుమిల్లి అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యాటక కేంద్రమైన మారేడుమిల్లిలో అక్రమ ఎర్రమట్టి తరలింపు వ్యవహారం సంచలనంగా మారింది. మారేడుమిల్లి కేంద్రంలో ఉన్న ప్రముఖ ఆరణ్య రెసిడెన్సీకి భారీ స్థాయిలో ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యాలు ప్రత్యక్ష సాక్ష్యంగా వెలుగులోకి వచ్చాయి.రిసార్ట్ ప్రధాన గేటు వద్ద లోపలికి వెళ్లే రహదారి వెంబడి కొత్తగా పోసిన ఎర్రమట్టి దిబ్బలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన ఫోటో ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎటువంటి అనుమతులు లేకుండా ఇంత పెద్ద మొత్తంలో మట్టిని ఎలా తరలిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ విరుద్ధంగా తవ్వకాలుసాధారణంగా ఎర్రమట్టి తవ్వకాలు, రవాణా చేయాలంటే రెవెన్యూ, మైనింగ్ శాఖ నుండి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఎక్కడి నుండి తీస్తున్నారు, ఎంత తీస్తున్నారు అనే వివరాలతో పాటు సీనరేజ్ చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ విషయంలో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండానే రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో



మట్టిని తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.ప్రజల ఆగ్రహంఇలా ఇష్టానుసారంగా మట్టిని తరలించడం వల్ల స్థానికంగా ఉన్న రహదారులు దెబ్బతింటున్నాయని, దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే మారేడుమిల్లి పరిస్థితిల ప్రాంతంలో అక్రమంగా రెసిడెన్సీలు పుట్టకక్కు లాగే పెరుగుతున్నాయని వాటికి ఎటువంటి అనుమతులు లేవని కూడా అందరికీ తెలిసిన విషయమే. ఇంతటితో ఆగకుండా రెసిడెన్సి లోపలికి అక్రమంగా ట్రాక్టర్లతో ఎర్ర మట్టి తరలించడం జరుగుతుంది

# భూగర్భ జలాలకు పొంచి ఉన్న ముప్ప

## (హెచ్. ప్రతాప్)

నగరం విస్తరిస్తోంది.. ఆకాశహర్మ్యాలు పెరుగుతున్నాయి.. కానీ భూమి అడుగున నీటి నిల్వలు మాత్రం కరిగిపోతున్నాయి. వర్షపాతం తగ్గడం ఒకవైపు, భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేయడం మరోవైపు హైదరాబాద్ భవిష్యత్తు నీటి భద్రతకు సవాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఈశాన్య హైదరాబాద్‌లో బోర్లపై పెరుగుతున్న ఆధారపడటం, వాటి నుంచి అధికంగా నీటిని వెలికితీయడం ఆందోళన కలిగిస్తోంది. బోర్లు ఎండిపోవడం రాబోయే నీటి సంక్షోభానికి ముందస్తు హెచ్చరికగా భావించాలి.

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల్లో పీజోమీటర్ల ద్వారా నమోదైన వివరాలు భూగర్భ జలమట్టాల స్వల్ప పెరుగుదలను మాత్రమే సూచిస్తున్నాయి. జూలై--ఆగస్టు మధ్య కూకట్‌పల్లి మండలంలో 3.08 మీటర్ల మేర పెరుగుదల నమోదుకాగా, బాచుపల్లిలో 0.35 మీటర్లే నమోదైంది. ప్రాంతాల మధ్య వ్యత్యాసాలున్నా, తక్కువ వర్షపాతం కారణంగా భూగర్భ జలాల పునర్భరణ ఆశించిన స్థాయిలో జరగలేదన్నది స్పష్టం.

వేగవంతమైన పట్టణీకరణ సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. కాంక్రీట్ నిర్మాణాలు, రహదారులు, పార్కింగ్ ప్రదేశాల విస్తరణతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే సహజ మార్గాలు తగ్గుతున్నాయి. దీనికి తోడు అనుమతులు లేకుండా బోర్లు వేయడం, ఉన్న బోర్ల నుంచి అధికంగా నీటిని తోడేయడం వల్ల భూగర్భ జల నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ఒక ప్రాంతంలో అధిక వెలికితీత సమీప బోర్లపై కూడా ప్రభావం చూపుతోంది.

ఈ పరిస్థితిలో స్థానిక సంస్థల బాధ్యత కీలకం. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు తమ పరిధిలోని బోర్లను నమోదు చేసి, కొత్త బోర్లకు అనుమతులను భూగర్భ జల పరిస్థితికి అనుగుణంగా నియంత్రించాలి. అక్రమ బోర్లపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి. భవన నిర్మాణ అనుమతుల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థను తప్పనిసరి చేయడంతోపాటు, అది వాస్తవంగా అమలవుతోందో పరిశీలించాలి.

చెరువులు, కుంటలు, నాలాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడటం కూడా స్థానిక సంస్థల ప్రాధాన్య కర్తవ్యంగా ఉండాలి. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, పార్కులు, రహదారుల వద్ద వర్షపు నీటిని భూమిలోకి మళ్లించే ఏర్పాట్లను విస్తరించాలి. భూగర్భ జలమట్టాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచితే నీటి వినియోగంలో బాధ్యత పెరుగుతుంది.

భూగర్భ జలం ఏర్పడటానికి సంవత్సరాలు పడుతుంది; క్షీణించడానికి మాత్రం కొద్దికాలమే చాలు. అందుకే వర్షపు ప్రతి చుక్కను భూమిలోకి చేర్చి, ప్రతి బోరు వినియోగాన్ని బాధ్యతతో నియంత్రించాలి. ప్రభుత్వ పర్యవేక్షణ, స్థానిక సంస్థల కట్టుదిట్టమైన అమలు, ప్రజల సహకారం కలిసినప్పుడే హైదరాబాద్‌కు దీర్ఘకాలిక నీటి భద్రత సాధ్యమవుతుంది.

# దళిత ద్రోహి హమారా ప్రసాద్ ను వెంటనే అరెస్ట్ చేయాలి.

## దిష్టి బొమ్మ దహనం

## దళిత గిరిజన బహుజన సంఘాల డిమాండ్.

**ములుగు జిల్లా. ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 5 ములుగు**భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వాక్యాలు చేస్తున్న దళిత ద్రోహి హమారా ప్రసాద్ ను వెంటనే ప్రభుత్వం అరెస్ట్ చేయాలని ములుగు జిల్లా దళిత గిరిజన బహుజన సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు.



ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహనికి పూల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి ఏరియా ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హమారా ప్రసాద్ దిష్టి బొమ్మ ను దగ్గం




చేశారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ జన్ను రవి మాట్లాడుతూ ఈ దేశానికి అంబేద్కర్ రాజ్యంగాన్ని అందించి అన్ని మతాల, కులాల ప్రజలందరికీ సమాన హక్కులను అందించారని ఆయన కొనియాడారు. ఆ లాంటి గొప్ప నాయకుడిపై హమారా ప్రసాద్ ఇష్టం వచ్చిన రీతిలో అసత్య ప్రచారాలు చేయడం అన్యాయమని ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నెమలి నర్సయ్య మాదిగ మాట్లాడుతూ హమారా ప్రసాద్ ను ఇరవై నాలుగు గంటల లోపు అరెస్ట్ చేయాలని, లేనియెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ వాది చంటి భద్రయ్య మాట్లాడుతూ ఈ దేశం తో పాటు ప్రపంచ దేశాలు అంబేద్కర్ సేవలను కొనియాడుతుంటే హమారా ప్రసాద్ మాత్రం అంబేద్కర్ ను హేళన చేసి మాట్లాడం కల్పిత నాయకుడు అంబేద్కర్ అంటూ మనువాదం మతం ముసుగులో పుస్తకం రాయడం ఆయన అవివేకమని నిదర్శనం అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆపుస్తకాన్ని విడుదల కాకుండా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ద్వారా ప్రజల ఓట్లతో గెలిచిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఎమ్మెల్యేలు , మంత్రులు , ఎంపీలు , ఈ సంఘటన పై నోరు మెదపకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మద్దునూరి రమేష్ కాడపాక శ్యామ్ మరాటి రవీందర్ గద్దం భద్రయ్య బొమ్మకంటి రమేష్ వర్మ ముంజాల బిక్షపతి రెంటాల బిక్షపతి బోడ రాములు బోట్ల కార్తీక్ ల్యాదల్ల అశోక్ మాడుగుల రమేష్ చుంచు రవి ఎనగందుల కొమురయ్య ఎలువాల రాజు కుమార్ రత్నం ప్రవీణ్ మరాఠీ రవీందర్ కవ్వంపెల్లి సారయ్య గడ్డమీది దేవేందర్ ఎనగందుల నరేష్ రత్నం దామోదర్ ఇంజపెల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా వాసి ఒంగోలులో లాక్ అప్ డెత్ !

ఒంగోలు పోలీసుల లాకప్లోనే తన కుమారుడ్ని చంపేశారని బాధిత తల్లి కన్నీరు పెడుతోంది. పొలాల్లో దివ్యతేజ మృతదేహం లభ్యం అయింది. బోగోలు మండలంకు చెందిన దివ్య తేజను పోలీసులే హతమార్చారని తల్లి, సోదరి ల ఆరోపణ. విచారణ నిమిత్తం తీసుకెళ్ళి తమకు తెలియదు అని పోలీసులు వాదించారు. ఐదు రోజులు దివ్యతేజ ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమించాం.. మిస్సింగ్ కేసు కూడా నమోదు చేయాలి అని ఒత్తిడి తెచ్చామని అన్నారు. పోలీసులే తీసుకెళ్ళి తీవ్రంగా గాయపరిచారు, పోలీస్ దెబ్బలకే తేజ చనిపోయాడు. మృతదేహాన్ని కూడా మాయం చేయాలి అని చూశారు. హైకోర్టులో పిటిషన్ వేయడంతో ఒక గంటలో మృతిదేహం లభించింది అని డ్రామా చేశారని ఆరోపించారు. హైకోర్టును ఆశ్రయించకపోయింటే శవాన్ని కూడా ఇచ్చే వారు కాదు. మాకు ఈ ప్రభుత్వం పై, పోలీసులపై నమ్మకం లేదు. దివ్య తేజా మృతిపై సీబీఐ విచారణ జరపాలి అని డిమాండ్ చేస్తున్నామని వారు అన్నారు.


# కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి సుధీర్ నియామకం

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి:** వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి సుధీర్ నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆయనకు అప్పగించిన బాధ్యతల పట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముప్పిడి సుధీర్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. పట్టణంలో పార్టీకి మరింత ప్రజాదరణ తీసుకురావడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు.తనకు పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ముప్పిడి సుధీర్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకుల సూచనలు, కార్యకర్తల సహకారంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన సుధీర్‌కు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# అభిషేక సోమసూత్ర మార్గాన్ని పున ప్రారంభం చేసిన పురావస్తు శాఖ



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 5 వెంకటాపురం** ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప ఆలయ గర్భాలయంలో, అభిషేకం తర్వాత మిగిలిన జలాన్ని (అభిషేక జలం) బయటకు పంపేందుకు ఉద్దేశించిన పురాతన 'సోమసూత్ర' మార్గాన్ని భారత పురావస్తు శాఖ ఏ ఎస్ ఐ హైదరాబాద్ సర్కిల్ విజయవంతంగా పునరుద్ధరించింది. కాలక్రమేణా ఈ సోమసూత్ర మార్గం మూసుకుపోవడంతో, ఆగమ శాస్త్ర విధులకు అనుగుణంగా అభిషేకాలు నిర్వహించడంలో ఆటంకం ఏర్పడింది. ఈ పునరుద్ధరణ ప్రక్రియను 'ఎటువంటి నష్టం కలిగించని శాస్త్రీయ సంరక్షణ పద్ధతుల' ద్వారా చేపట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా: - అంతర్గతంగా ఏర్పడిన అడ్డంకులను శాస్త్రీయ పద్ధతిలో 3ఃః మ్యాపింగ్ చేయడం, - ఎండోస్కోపిక్ కెమెరాలు మరియు రియల్-టైమ్ మానిటరింగ్ స్క్రీన్‌లతో కూడిన జీవో ప్రో కెమెరాలను ఉపయోగించి పరిశీలించడం, - ఆలయ నిర్మాణానికి ఎటువంటి హాని కలగకుండా, 'సాఫ్ట్-డ్రిల్లింగ్' పద్ధతి ద్వారా అడ్డంకులను పొరల వారీగా జాగ్రత్తగా



తొలగించడం వంటి చర్యలు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో,ఋూ× హైదరాబాద్ సర్కిల్ బృందం ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ పని నిర్వహించబడింది. ఈ పని విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం సోమసూత్ర మార్గం పూర్తిగా పనిచేసే స్థితిలో ఉంది, దీనివల్ల భక్తులు ఎటువంటి ఆటంకం లేకుండా ఆగమ శాస్త్ర విధులకు అనుగుణంగా అభిషేకాలు నిర్వహించుకోవచ్చు.

పాల్గొన్న అధికారులు పురావస్తు శాఖ డీఈ కృష్ణ చైతన్య, సీఏ లు మల్లేష్, అజిత్, వంశీకృష్ణ, దేవాదాయ శాఖ ఈవో ఇమ్మడి భాస్కర్ తదితరులు ఉన్నారు...

# నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో కేసీ కెనాల్ కు నీటి విడుదల.



నంద్యాల నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల, మల్యాల ఎత్తిపోతల పథకం ల నుంచి కర్నూలు - కడప (కేసీ కెనాల్ ) కు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ లోక్ సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు నీటి విడుదల చేసినట్లు ముచ్చుమర్రి టీడీపీ నాయకులు కాటం వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అనుచరులు, ముచ్చుమర్రి గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు కాటం. వెంకటరామిరెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి.నాగరాజుల, ముచ్చుమర్రి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ నాగభూషణం, సుబ్బారావు, బాల నారాయణ, అంజనేయ నగర్ రవి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా జనం తరలిరావడంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద కృష్ణమ్మకు కుంకుమ, పసుపు, గాజులు, వడిబియ్యం కొత్త చాటలో పెట్టి సారే సమర్పించి, కృష్ణమ్మ జలహారతి ఇచ్చి కేసీ కెనాల్ కు నీటి విడుదల చేశారు. కేసి కెనాల్ డి ఈ ఈ ప్రసాద్, ఏ ఈ ఈ లు వీరమ్మ, శ్రీనివాస నాయక్ లు మాట్లాడుతూ శనివారం ఉదయం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదలకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి రెండు మోటార్ల ద్వారా 480 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం ఒక మోటారు ద్వారా 325 క్యూసెక్కుల నీరు, మొత్తం 805 క్యూసెక్కుల నీరు కర్నూలు-కడప (కేసీ కెనాల్) కు విడుదల చేయడం జరిగిందన్నారు. కేసీ కెనాల్ కు వదిలిన నీరు కేవలం తాగునీటి అవసరాలకే అన్నది మరువవద్దని, ఇరిగేషన్ ఉన్నతాధికారులు కూడా తాగునీటి అవసరాలకే కేసీ కెనాల్ కు నీటి విడుదలకు ఆదేశించినట్లు కేసీ కెనాల్ డి ఈ ఈ ప్రసాద్ స్పష్టం చేశారు.

# కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం




రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం దక్కింది. దేవీపట్నం మండలం, ఇందుకూరు పంచాయతీ పరిధిలోని ఎం.రావిలంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయుడు గారపాటి శ్రీనివాస కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సన్మానం చేశారు.కలెక్టర్ ప్రశంసలుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరి లంక గ్రామమైన ఎం.రావిలంక వంటి మారుమూల ప్రాంతంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేయడం గొప్ప విషయమన్నారు. శ్రీనివాస కుమార్ సేవలు ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శమని కొనియాడారు.

అవార్డు గ్రహీత ఆనందం

అవార్డు పట్ల సంతోషం వ్యక్తం చేసిన శ్రీనివాస కుమార్, తనను ప్రోత్సహించిన దేవీపట్నం ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు, ఇందుకూరు పంచాయతీ ప్రజలకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మర్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ప్రెస్ మీట్ సమావేశం ఏర్పాటు చేసిన మండల ప్రెసిడెంట్ సురేష్ యాదవ్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్5 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ప్రెస్ మీట్ కార్యక్రమం మండల ప్రెసిడెంట్ తుమ్మల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ముఖ్యంగా బి ఆర్ఎస్ నాయకులు పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేరు ఒక్క ఇల్లు ఇవ్వలేరు ఏకకాలంలో రుణమాఫీ చేయలేరు కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఉచిత బస్సు ఉచిత కరెంటు ఇలా ఒక్కొక్కటిగా అన్ని హామీలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు ఎన్ఆర్ఐఏఎస్ నుండి సిసి రోడ్లు పదేళ్లలో చేయలేని అభివృద్ధి కార్యక్రమాలు రెండున్నర సంవత్సరాల్లో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు ఈనాడు కాంగ్రెస్సు వ్యతిరేకిస్తున్న నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక పదవులు అనుభవించి కాంగ్రెస్ ప్రభుత్వం నుండి గెలుపొంది వెన్నుపోటు మాటలు సరికాదని తెలిపారు మళ్ళీ వికారాబాద్ శాసనసభ్యులుగా ప్రసాద్ కుమార్ గెలుపు పక్క 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అధికారంలో ఉంటుందని తెలిపారు రాజశేఖర్ రెడ్డి గారు తలపెట్టిన ఆరోగ్యశ్రీ ఈనాడు 5 లక్షల నుండి పది లక్షల వరకు సామాన్యమైన మనిషి గురించి ఆలోచన చేసి ఇంత మంచి నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ముఖ్యమంత్రిని మరొకసారి అభినందించాలని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమం అని తెలిపారు ఈనాడు పావుల వడ్డీకే రుణాలు మహిళా సమైక్యకు ఒక బస్సు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం తెలిపారు కార్యక్రమంలో మర్పల్లి మండల అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ , జిల్లా నాయకులు కృష్ణారెడ్డి , యు రవీందర్,పెద్దలు సుభాష్ యాదవ్, స్థానికగ్రామ సర్పంచ్ మధుగు రామేశ్వర్, మరియు నూతనంగా గెలుపొందిన వివిధ గ్రామాల సర్పంచులు మండలసర్పంచుల సంఘం అధ్యక్షులు రఫీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి సురేష్, మహేష్, టౌన్ ప్రెసిడెంట్ మధుకర్ రెడ్డి, మహమ్మద్ గౌస్, పాండురంగారెడ్డి, చంద్రన్న, దయాకర్, తిరుపతి, యూత్ యువ నాయకుడు లడ్డు,నాయకులు పెద్దలు కార్యకర్తలు ప్రెస్ మీట్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్ తెలిపారు

# అర్హులందరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియలో జాప్యం వద్దు**

**నోటీసుల అనంతరం ఓటర్ల నుంచి అందుతున్న ధ్రువపత్రాల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 5:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026లో భాగంగా నోటీసులు జారీ చేసిన అనంతరం సంబంధిత ఓటర్ల నుంచి అందుతున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు.



శనివారం అంతాయిపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మ్యాపింగ్ జరగని ఓటర్లు, ఓటరు కార్డులో వివరాల వ్యత్యాసాలు (అనామలీస్) ఉన్నవారికి జారీ చేసిన నోటీసులకు స్పందించి ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లు తమ వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా అవగాహన కల్పించాలని కోరారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని అన్నారు.

కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి లిఫారం-6, చిరునామా మార్పు కోసం లిలిఫారం-7, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల వివరాల కోసం లిలిఫారం-8లి అందించి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో వెంకటరెడ్డి, ఏఈఆర్ఓ మధుసూదన్‌రెడ్డి, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

**ప్రత్యేక ప్రచార దినాల్లో ఓటరు జాబితా సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**:: ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 05 గోవిందరావుపేట్**శనివారం ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా గోవిందరావుపేట మండలంలోని గోవిందరావుపేట, చల్వాయి, తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, కాటాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో కృష్ణవేణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఓటర్ల ముసాయిదా జాబితాలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.



ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, వివరాల సవరణలకు సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్ణీత నమూనా పత్రాల్లో స్వీకరించాలని ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకుండా బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

సెప్టెంబర్ 6, 12, 13 తేదీల్లో కూడా ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు సహకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ పోలింగ్ కేంద్రాలను సందర్శించి నిర్ణీత గడువులో దరఖాస్తులు, అభ్యంతరాలను సమర్పించాలని కోరారు.

నూతన ఓటరు నమోదుకు నమూనా--6, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించేందుకు నమూనా--7, వివరాల సవరణకు నమూనా--8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2026 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు నిర్ణీత ప్రకటన పత్రంతోపాటు నమూనా--6ను సమీపంలోని బూత్ స్థాయి అధికారికి సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజల భాగస్వామ్యంతో తప్పులులేని సమగ్ర ఓటర్ల జాబితా రూపుదిద్దుకుంటుందని, తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని ఆర్డీవో కృష్ణవేణి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్ కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నితీష్, తాడ్వాయి సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలతో ఫారంపాండ్ నిర్మాణం

## యస్,ఇటిక్యాల గ్రామ శివారులో ఫారంపాండ్ నిర్మాణం పూర్తి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 05 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** పుల్కల్,మండల పరిధిలోగలఎస్,ఇటిక్యాల, గ్రామ శివారులో గత నెల రోజుల నుండి, జాతీయ ఉపాధి హామీ పథకం కింద,ఈ ఫారంపాండ్ 1,లక్ష 25వేల రూపాయలతో నిర్మించడం జరిగింది, (ఏలి నీవో )ప్రభావంతో, వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే, గ్రామపంచాయతీ తీర్మానం చేసి, ఈ ఫారం పాశీడ్, గుంతను తవ్వి నిర్మించడానికి నీటి కుంట నీటి సంరక్షణ మరియు బోర్వెల్ రిజర్వు, పశువులకు నీరు,పంట పొలాలకు నీరు, బోరు గ్రౌండ్ వాటర్ పెరగడానికి, ఈ ఫారంపాండ్ వర్షానికి నిండితే, ఒక్కసారి కాలం పోయినా,ఈ ఫారం పాండ్ గుంతఉపయోగపడుతుందని, అలాగే చేప పిల్లలు పెంచుకోవడానికి కూడా ఉపయోగపడుతుందని, స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ జి, సూర్ రెడ్డి తెలియ చేశారు, దీని సైజు 12 ఐ 12, = 75 వేల రూపాయలు, లేబర్ పేమెంట్ చేయగా, ఈ లక్ష రూపాయల నుంచి మిగిలినవి మిగతా అమౌంట్ మెటీరియల్ పేమెంట్ కు అని ఆయన తెలియజేశారు, దీంతో రైతులు ఎంతో సంతోషపడుతున్నారు.....

# విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం...

## మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో చేసిన మోసాలపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన లో భాగంగా ద్మారావు నగర్ లో ఫీజు రీ యంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని విద్యార్థుల భారీ ర్యాలీ లో అయన పాల్గోన్నారు.

పద్మారావు నగర్ లోని ఎస్పీ కాలేజీ వద్ద నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గోన్నారు.

తలసాని మాట్ఆడుతూ పీజు రీ యంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నది. జిఓ 97 తీసుకొచ్చి పాలిటెక్నిక్ విద్యార్థులను రోడ్లపైకి తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన ఆస్తుల కోసం ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. ఎన్నికలలో ఇచ్చిన హామిలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ప్రజలను మోసం చేసి ప్రజా పాలన అందించామని సిగ్గు లేకుండా ప్రచారం చేసుకుంటున్నారు. పరిపాలన చేతగాక, పాలనను గాలికొదిలేశారని అన్నారు.కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి రిబ్బన్ లు కట్ చేస్తుండు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేదే లేదు. మీ ప్రభుత్వం పోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.

# రెండు కార్ల మధ్య నుజ్జునుజ్జు అయిన స్కూటీ

## ఒక మైనర్ మృతి.. మరోకరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి మైనర్ల డ్రైవింగ్ విషాదంగా మారింది. కామారెడ్డి పాత జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్ల మధ్య స్కూటీ నుజ్జునుజ్జు అయింది. ఘటనలో హేమంత్ అనే బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బాలుడు లోకేష్కు తీవ్ర గాయాలు అయ్యాయి. 9వ తరగతి చదువుతున్న వీరిద్దరు ప్రాణ స్నేహితులు . కారు నడుపుతున్న వ్యక్తి కూడా మైనర్ గా పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాద దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు అయ్యాయి.

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్.





**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 5 సెప్టెంబర్ 2026**సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని స్మరిస్తూ, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ: ఈ సందర్భంగైనా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు కలిసి అశేష సంఖ్యలో అలకపూర్ గణేశ్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అంటూ బడాయి కొట్టే కాంగ్రెస్ పార్టీ నాయకులు గత రెండున్నరేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో చెల్లించకపోవడం సిగ్గుచేటని, తత్ఫలితంగా ప్రైవేటు డిగ్రీ, పీ.జీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, పరిణామంగా అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందక నరకం చూస్తున్నారని, అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తీరుతో రాష్ట్రంలో 960 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు కాస్తా 650 కి పడిపోయిందని, ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు మూతపడే ప్రమాదం ఎంతైనా ఉన్నదని స్థానిక నాయకులు మండిపడ్డారు.

చిన్న పట్టణాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ కళాశాలలే పేద, మధ్యతరగతి విద్యార్థులకు దిక్కని, ఉన్నత విద్య అందించే కళాశాలలు మూత పడటం అంటే ఆ ప్రాంతంలోని వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావడమేనని భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, షకీలా రెడ్డి, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, కీర్తిలత గౌడ్, యాలాల కిరణ్, జయరాం, శ్రీధర్, విఠల్, బాబు రావు, రమణ మూర్తి, ప్రసాద్, నరేష్, భానుచందర్, శేఖర్ తదితరులు ఆందోళన వ్యక్తం చేస్తు నిరసన కార్యక్రమంను చేపట్టారు. కావున కాంగ్రెసు ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో విద్యార్థుల సహకారంతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ భద్రతే అత్యంత ప్రాధాన్యత

## ఎస్‌ఈ బి .బిక్షపతి స్పష్టం




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 05 ములుగు**ఈ నెల 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణలు, విగ్రహాల తరలింపు, నిమజ్జనం సమయంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రజలు, భక్తులు, మండప నిర్వాహకులు, విద్యుత్ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

"పండుగ వేడుకల్లో ఆనందం ఎంత ముఖ్యమో, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత అంతకంటే ముఖ్యం. ఒక చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్నందున విద్యుత్ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి" అని ఎస్‌ఈ స్పష్టం చేశారు.

నిమజ్జన మార్గాల్లో విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక సూచనలు

విగ్రహాల ఎత్తు, ట్రక్కులు, క్రేన్ల ఎత్తును దృష్టిలో ఉంచుకుని నిమజ్జన మార్గాలను విద్యుత్ సిబ్బంది ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు.

మార్గంలోని విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాలను తనిఖీ చేయాలి.

ప్రమాదకరంగా లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలి.

నిమజ్జన మార్గాల్లో మార్గాల పరిశీలన పూర్తి చేసి, సంబంధిత అధికారుల ద్వారా ముందస్తుగా ధృవీకరించాలి.

క్రేన్లు, భారీ వాహనాలు, ఎత్తైన విగ్రహాలు విద్యుత్ లైన్లకు తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రజలకు, మండపం నిర్వహులకు పలు సూచనలు.లి

విద్యుత్ లైన్లకు దగ్గరగా గణేష్ విగ్రహాలు, క్రేన్లు, మెటల్ ఫ్రేములు లేదా ఇతర అలంకరణ సామగ్రిని తీసుకెళ్లడం ప్రమాదకరమని, జాగ్రత్తగా, దూరంగా తీసుకువెళ్లాలని కోరుతున్నారు.

విద్యుత్ తీగను నేరుగా తాకకపోయినా దగ్గరగా వెళ్లడం వల్ల విద్యుత్ ప్రసరణ/ఇండక్షన్ కారణంగా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. కాబట్టి విద్యుత్ లైన్లకు సురక్షిత దూరం పాటించడం తప్పనిసరి. మండపాలు, నిమజ్జన మార్గాలు, ప్రధాన రహదారుల్లో ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో ఎక్కడైనా తెగిపోయిన విద్యుత్ తీగలు , లూజ్ లైన్లు,విద్యుత్ స్తంభాలు, ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే ప్రజలు వాటిని తాకకూడదు.

వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరుతున్నారు.

గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేసేటప్పుడు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని చెప్పారు.

విద్యుత్ కనెక్షన్‌ను అధికారిక విద్యుత్ సిబ్బంది ద్వారానే పొందాలి.

నాణ్యమైన, మార్క్ కలిగిన వైర్లు, పరికరాలను మాత్రమే ఉపయోగించాలి.

సరైన సామర్థ్యం కలిగిన

ఎం సి పి రక్షణ పరికరాలు

/ఏర్పాటు చేసుకోవాలి.

జాయింట్లు, దెబ్బతిన్న వైర్లు, టేప్‌తో తాత్కాలికంగా చేసిన కనెక్షన్లను ఉపయోగించరాదు.

విద్యుత్ వైరింగ్‌ను నీరు, తేమకు దూరంగా ఉంచాలి.

వర్షం పడినప్పుడు తడిసిన వైర్లు, స్విచ్‌లు, విద్యుత్ పరికరాలను తాకరాదు.

పిల్లలను విద్యుత్ స్తంభాలు, వైర్లు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలి.

మండపాల వద్ద మెటల్ నిర్మాణాలు విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కేబుల్ వైర్లపై ప్రత్యేక దృష్టి

టీవీ, ఇంటర్నెట్ తదితర కేబుల్ వైర్లు విద్యుత్ స్తంభాలపై చిందరవందరగా లేదా తక్కువ ఎత్తులో వేలాడుతూ ఉండకుండా సంబంధిత కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

పండుగ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి వైర్లను ప్రత్యేకంగా తనిఖీ చేసి ప్రమాదకర పరిస్థితులను తొలగించాలని సూచించారు.

విద్యుత్ భద్రత , ప్రతి ఒక్కరి బాధ్యత

విద్యుత్ భద్రతా నియమాలు పాటిస్తూ, టీజీఎన్పీడీసీఎల్ కు సహకరించి వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా, ముఖ్యంగా ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు లేకుండా సురక్షితంగా నిర్వహించుకోవాలని ప్రజలకు ఎస్‌ఈ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం




**జహీరాబాద్, సెప్టెంబరు 5 ప్రజాబలం ప్రతినిధి:** విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడంతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవల కమిటీ చైర్మన్ జి.కవితాదేవి సూచించారు. మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో శనివారం జహీరాబాద్‌లోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ ఖలీల్‌తో కలిసి ఆమె విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయులు, తోటివారిని గౌరవించాలని తెలిపారు. బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా, దురుసుగా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు దిశానిర్దేశం చేసే వారని, వారిని గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని సూచించారు. మోటారు వాహనాల చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇస్మాలప్ప, దామోదర్‌రెడ్డి, మహేష్, జగన్, అనూష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, న్యాయ సేవల సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై సత్తుపల్లిలో బీఆర్ఎస్ రణభేరి

### విద్యార్థులు, నిరుద్యోగులతో సండ్ర వెంకట వీరయ్య భారీ ర్యాలీ

**సత్తుపల్లి, ప్రజా బలం ప్రతినిధి సెప్టెంబర్ 05** : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. యువత, విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు.

బీఆర్ఎస్ చేపట్టిన 1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాటలో భాగంగా సత్తుపల్లిలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి






సండ్ర వెంకట వీరయ్య భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అనంతరం జరిగిన సభలో సండ్ర మాట్లాడుతూ 100 రోజుల్లో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తయినా ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, విద్యా భరోసా కార్డుల హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకుల విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సండ్ర ఆరోపించారు. జిల్లాకో యూపీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, పోటీ పరీక్షల దరఖాస్తు రుసుముల మినహాయింపు వంటి హామీలను కూడా అమలు చేయాలని కోరారు. యూత్ డిక్లరేషన్‌లోని ప్రతి హామీపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా వెంటనే హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో కేటీఆర్ నాయకత్వంలో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకట వీరయ్య హెచ్చరించారు.

## సమ్మర్ కి మోక్షజ్ఞ తెరంగ్రేటం

హైదరాబాద్, సెప్టెంబర్ 5, బాలయ్య బాబు చేసిన సినిమాలు ఆయన్ని టాప్ లెవల్లో నిల్పోబెట్టాయి? ఎన్నో వైవిధ్యమైన పాత్రలను పోషించిన ఆయన స్క్రీన్ మీద ఒక సింహం లా కనిపిస్తాడు. అతని డైలాగ్ డెలివరీ కి ఫిదా కానివారు ఉండరు? నందమూరి తారక రామారావు గారి నట వారసుడిగా కెరియర్ ని స్టార్ట్ చేసిన ఆయన తండ్రికి తగ్గ తనయుడిగా ఎదిగాడు. ప్రేక్షకులందరిని మెప్పించడంలో ఆయన చాలావరకు సక్సెస్ అయ్యాడు. మాస్ హీరోగా అవత రించడమే కాకుండా బీ,సీ సెంటర్లో ఉన్న ప్రేక్షకులందరిని మైమరిపింపజేసేలా తన డైలాగులతో వాళ్లను అలరించాడు. ఇప్పటివరకు ఆయన చేసిన సినిమాలు అతన్ని టాప్ మోస్ట్ హీరోగా మార్చాయి. అలాంటి బాలకృష్ణ ఈ మధ్యకాలంలో చేస్తున్న సినిమాల విషయంలో వైవిధ్యాన్ని చూపిస్తున్నప్పటికి ఆయన సినిమాలు కొన్ని సక్సెస్ మరికొన్ని ఫ్లాపులుగా మారుతున్నాయి?ఇతని కొడుకు అయిన మోక్షజ్ఞను సైతం ఇండస్ట్రీకి పరిచయం చేయాలని కొన్ని సంవత్సరాలుగా అనుకుంటున్నప్పటికి ఇప్పటివరకు అది కార్యరూపమైతే దాల్చలేదు. గతంలో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో సినిమా రాబోతుంది అంటూ కొన్ని వార్తలు ఇచ్చినప్పటికి అది వర్కౌట్ కాలేదు. దాంతో ఇప్పుడు దసర కి మోక్షజ్ఞ సినిమాని స్టార్ట్ చేయబోతున్నారట.వచ్చే ఏడాది సమ్మర్లో ఆ సినిమాని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టుగా తెలుస్తుంది. ఓపెనింగ్ రోజే సినిమా రిలీజ్ డేట్ ని కూడా చెప్పబోతున్నారట. నిజానికైతే బాలయ్య బాబు ఏదో గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు అంటూ చాలామంది చాలా రకాల కామెంట్లు చేస్తున్నారు? మోక్షజ్ఞ సైతం ఈ గ్యాప్ లో నటనకు సంబంధించిన మెలుకువలను నేర్చుకోవడమే కాకుండా డాన్సులు సైతం చాలా ఎక్కువగా ప్రాక్టీస్ చేశారట.మొదటి సినిమాతో తనలోని పూర్తి నటుడిని బయటికి తీయాలనే ప్రయత్నం కూడా చేస్తున్నట్టుగా తెలుస్తుంది. తను అనుకున్నట్టుగానే ఈ సినిమాతో సక్సెస్ ఫుల్ టాక్ ని సంపాదించుకుంటాడా? మొదటి సినిమాతోనే హీరోగా మారతాడా? లేదా అనేది తెలియాలంటే మాత్రం మరి కొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే?

# బోన్ క్యాన్సర్ బాధితుడికి కేటీఆర్ భరోసా...

## ధైర్యంగా ఉండు తమ్మీ.. త్వరలోనే మీ ఇంటికి వస్తా



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 5:** బోన్ క్యాన్సర్‌తో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అండగా నిలిచారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి తాను ఉన్నానంటూ భరోసా కల్పించారు.

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రామచంద్రరావుబంజర్‌కు చెందిన బన్నె మణికంఠ యాదవ్ కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం ఇప్పటికే కుటుంబం భారీగా ఖర్చు చేసింది. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ప్రస్తుతం మణికంఠను ఇంటికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులు సంరక్షిస్తున్నారు.

మణికంఠ పరిస్థితిని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి పరిస్థితిని తెలుసుకుని కేటీఆర్‌కు విషయం వివరించారు. అనంతరం బాధిత యువకుడితో కేటీఆర్ వీడియోకాల్‌లో మాట్లాడేలా చొరవ తీసుకున్నారు.ధైర్యంగా ఉండు తమ్మీ.. మేమున్నాం

వీడియోకాల్‌లో మణికంఠతో కేటీఆర్ ఆప్యాయంగా మాట్లాడారు.

తమ్మీ.. ధైర్యంగా ఉండు. నీకు, నీ కుటుంబానికి మేము అండగా ఉంటాం. చికిత్సకు అవసరమైన సహాయం అందించేలా చూస్తాం. భయపడకు.. ధైర్యంగా ఉండాలి” అంటూ భరోసా ఇచ్చారు.

కేటీఆర్‌తో మాట్లాడిన సందర్భంగా మణికంఠ భావోద్వేగానికి గురై..

సార్.. మిమ్మల్ని ఒక్కసారి నేరుగా కలిసి మాట్లాడాలని ఉంది అని కోరారు.

దీనికి కేటీఆర్ స్పందిస్తూ..

తప్పకుండా తమ్మీ.. త్వరలోనే మీ ఇంటికి వస్తా. అప్పటివరకు ధైర్యంగా ఉండాలి” అంటూ హామీ ఇచ్చారు.

కేటీఆర్ ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పడంతో మణికంఠతో పాటు ఆయన కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. కష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచారు.

# విద్యార్థులు, యువత సమస్యలు పరిష్కరించాలి

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి.. జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి

### -- ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, సెప్టెంబర్ 5 ప్రజాబలం ప్రతినిధి:** విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయడంతోపాటు నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను





అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకత్వంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని లైఫ్‌స్టైల్ కాంప్లెక్స్ మోర్ సూపర్ మార్కెట్ నుంచి కుమార్ హోటల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం విద్యార్థులు, యువతతో సమావేశం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో యువత పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జీవో 97ను రద్దు చేయాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను తీవ్రంగా వ్యతిరేకించారు. “జీవో 97 వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగడతాం. పాలిటెక్నిక్ కళాశాలల విలువైన భూములు, ఆస్తులపై ప్రభుత్వం కన్నేసింది” అని ఆరోపించారు. జీవో 97ను రద్దు చేసే వరకు పాలిటెక్నిక్ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను నెరవేర్చాలని కోరారు. హామీల అమలులో ప్రభుత్వం మరింత జాప్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిమ్, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, బండి మోహన్, యాకూబ్, బొగ్గుల సంగమేశ్వర్, నరసింహగౌడ్, నరసింహరెడ్డి, సురేష్, కలీమ్, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు. బీఆర్ఎస్వీ జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు రాకేష్, జే. రవికిరణ్, ఓంకార్, పరశురాం, ఫయాజ్, మారుతీ యాదవ్, అశోక్‌రెడ్డి, రఘుతేజ, నవీన్‌తేజ, మధు, ఇక్బాల్, ప్రసాద్, లవన్, రవి తదితర విద్యార్థి నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## బి జెడ్పి సీఈవో జానకి రెడ్డి



**జహీరాబాద్, సెప్టెంబర్ 5 ప్రజాబలం ప్రతినిధి:** గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి అధికారులను ఆదేశించారు. జహీరాబాద్ ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఏపీవోలు, ఏపీఎంలు, టీఏలు, ఎఫ్ఏలతో అదనపు డీఆర్‌డీవో బాలరాజు, ఎంపీడీవో మహేందర్ రెడ్డి తో కలిసి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీఎస్ఏపీ కార్యక్రమం పురోగతి, అమలు, వీఓఏ భవనాల నిర్మాణ పనులు, జలసిరి పనుల అమలు, ఫామ్ పాండ్ల అభివృద్ధి--నిర్మాణం, గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల పురోగతి, లక్ష్యాలపై అధికారులతో సమీక్షించారు. ఆయా పనుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని, చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సీఈవో సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో సాధించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



## ఉపాధ్యాయులను సన్మానించిన సర్పంచ్ కటిక కిరణ్.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 5:** తల్లాడ మండలం మల్లవరం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నందు మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి మరియు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మల్లవరం పాఠశాలలో గ్రామ సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మల్లవరం ప్రాథమిక పాఠశాలను జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన టీచర్లకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా మల్లవరం పాఠశాలలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లవరం మాజీ ఉప సర్పంచ్ ఎర్రి నరసింహారావు మాట్లాడుతూ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేస్తూ వారి కృషిను కొనియాడారు. భవిష్యత్తులో ఇంకా మల్లవరం స్కూల్ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ధారావత్ యశోద,శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ మేడి సీతారాములు . పునాటి పిచ్చయ్య,దుగ్గిదేవర సీతారామయ్య,భూక్య అంజయ్య,ధరావత్ శ్రీనివాసరావు,మేడి బలరాం,కుప్పాల నరసింహారావు,సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధనకొండ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**జహీరాబాద్, సెప్టెంబరు 5 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల జహీరాబాద్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అస్లాం ఫారూఖీ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాధాకృష్ణన్ విద్యారంగానికి అందించిన సేవలు, ఆయన ఆలోచనలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఎస్. రాములు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుడు ఎంతోమంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దగలడని పేర్కొన్నారు. గురువులను గౌరవిస్తూ వారు చూపిన మార్గంలో నడవాలని విద్యార్థులకు సూచించారు. విద్యతోపాటు విలువలను అలవర్చుకుని సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు జగన్‌మోహన్, డి.ప్రీతి, నాగరాజ్, ఎం.డి. ముజఫర్ అలీ, సిద్ధప్ప, ఆర్.మదన్, మస్రత్, సత్యనారాయణ, ఇస్రత్ సుల్తానా, ఇర్ఫాన్ ఆ బేగం, జోహా, ఫాతిమా బేగం, ఇస్రాత్ ఉన్నిసా, రానా తబస్సుమ్, వుజైఫా తదితరులు మాట్లాడారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను కొనసాగిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు 5 లక్షల విలువైన బంగారు హారం కానుక

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారికి శనివారం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒక భక్తుడు ఘనంగా బంగారు ఆభరణాన్ని కానుకగా సమర్పించారు. పాలకోలు మండలం భాగ్యేశ్వరం గ్రామానికి చెందిన దొంగ వెంకట త్రిమూర్తి సత్యనారాయణ అనే భక్తుడు అమ్మవారికి మొక్కుబడిగా దాదాపు ?5 లక్షల విలువైన, 32 గ్రాముల బరువుగల బంగారు లక్ష్మీ తాడును సమర్పించారు. ఈ ఆభరణంలో తెలుపు, ఎరుపు మరియు పచ్చ రాళ్లు పొదగబడి ఉన్నాయి. ఈ కానుకను ఆలయ ప్రాంగణంలో డిప్యూటీ ఈఓ కిశోర్ కుమార్. భక్తుడి చేతుల మీదుగా స్వీకరించి అధికారిక రశీదు అందజేశారు. కానుక సమర్పించిన భక్తునికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక దర్శనం కల్పించి, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను డిప్యూటీ ఈఓ శ్రీ కిషోర్ కుమార్ అందజేశారు.

# ఉపాధ్యాయులందరికీ ‘ఉపాధ్యాయ దినోత్సవ’ శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

అమరావతి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉపాధ్యాయులందరికీ ‘ఉపాధ్యాయ దినోత్సవ’ శుభాకాంక్షలు తెలిపారు. విజ్ఞాన వృక్షం లాంటి గురువు గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. మనకు అక్షర జ్ఞానాన్ని అందించి, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసి, ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయులను మనం నిత్యం గౌరవించాలి. భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ‘సర్వేపల్లి రాధాకృష్ణన్’ ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని అత్యున్నత స్థాయికి చేర్చారు. ఆ మహనీయుని జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నానని ఆయన అన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రపు కృష్ణ జన్మదిన వేడుకలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 05 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :**ఆందోల్ – జోగిపేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రపు కృష్ణ, పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ ఆబిద్, ఆధ్వర్యంలో గజమాల వేసి శల్వతో సన్మానించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈసందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆబిద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రపు కృష్ణ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నోజరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో మంచిగా ఉండాలని కోరుతూశుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో తెలంగాణ కెరటం స్టేట్ ఇంచార్జ్ షేక్ మహబూబ్ మైనార్టీ నాయకులు బాబా మహమ్మద్ రసూల్ మమ్మద్ కాజా తదితరులు పాల్గొన్నారు మైనార్టీ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు..

## ఐటిడిఏ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డిఎస్.నాగేశ్వరరావు రాహుల్ ఐఏఎస్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 5:**సెప్టెంబర్ ఐదు గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ భద్రాచలం గిరిజన భవన్ లో శనివారం జరిగిన ఉపాధ్యాయ సన్మానోత్సవ కార్యక్రమంలో ఏన్కూర్ మండలం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయులుగా పని చేస్తున్న డిఎస్.నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు ఆఫీసర్ బి. రాహుల్ ఐఏఎస్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చందన సర్పే,ఏపీవో డేవిడ్ రాజ్, ఖమ్మం ఏసిఎంఓ ఎల్. రాములు చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి ఏడు 1994న గిరిజన సంక్షేమ శాఖలో మొదటి నియామకం పొంది ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల బయ్యారం మండలం ఇర్సులాపురం, సింగరేణి మండలం రేలకాయలపల్లి, ఏన్కూరు మండలం మూలపోచారం పాఠశాలల్లో పనిచేస్తూ 32 సంవత్సరాలు పూర్తి చేసుకున్నానని గిరిజన మన్య ప్రాంతంలో గిరిజన విద్యార్థుల కోసం అహర్నిశలు శ్రమిస్తూ పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించడంలో కృషి చేస్తూ, విద్యార్థుల యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ,భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం నాకు కలిగినందుకు అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నేను బోధించే సబ్జెక్టులలో ఇప్పటివరకు నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటిడిఏ భద్రాచలం వారిచే, డిప్యూటీ డైరెక్టర్ భద్రాచలం, ఖమ్మం వారిచే సన్మానాలు, ప్రశంసలు పొందటం వలన నాపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావటం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, నాలుగో తరగతి ఉద్యోగులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, విద్యార్థిని,విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత: శ్రీ గౌరిశెట్టి చంద్రయ్య

## ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు -- ఉపాధ్యాయుల సన్మానం, పెన్షన్ పంపిణీ

హైదరాబాద్, సెప్టెంబర్ 5, 2026:ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి సేవా కేంద్రం ఆధ్వర్యంలో గురువులను ఘనంగా సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరిశెట్టి చంద్రయ్య పాల్గొనగా, బొగ్గారపు దయానంద్ , ఎమ్మెల్సీ ప్రత్యేకంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




ఈ సందర్భంగా గౌరిశెట్టి చంద్రయ్య మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే, ఉపాధ్యాయులు వారికి జ్ఞానాన్ని అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. బొగ్గారపు దయానంద్ ఎమ్మెల్సీ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును నిర్మించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని గౌరవించడం సమాజ బాధ్యతగా పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు మరియు సన్మాన పత్రాలను అందజేశారు. అలాగే సేవా కార్యక్రమాల్లో భాగంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్‌ను అందజేసి, వారి సంక్షేమానికి వాసవి సేవా కేంద్రం అండగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.వాసవి సేవా కేంద్రం ఆధ్వర్యంలో విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు వివరించారు. సమాజంలోని అవసరమైన వర్గాలకు సహాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వాసవి సేవా కేంద్రం నిర్వాహకులు, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లబ్ధిదారులు, ప్రముఖులు మరియు పలువురు సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.




## కాస్త పదజాలం మార్చి, పత్రికా శైలిలో ఇలా రాయవచ్చు: 6న రాచన్న స్వామి ఆలయానికి మహా పాదయాత్ర



**జహీరాబాద్, సెప్టెంబరు 5 ప్రజాబలం ప్రతినిధి:** లోకకల్యాణం, ప్రజల సుఖశాంతులను ఆకాంక్షిస్తూ ఈ నెల 6న జహీరాబాద్ నుంచి బడంపేటలోని శ్రీ రాచన్న స్వామి ఆలయం వరకు మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు వీరశైవ లింగాయత్ సమాజ్ ప్రతినిధులు, శ్రీ రాచన్న స్వామి భక్త బృందం సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు జహీరాబాద్ పట్టణంలోని శ్రీ రాచన్న స్వామి దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమై, వివిధ మార్గాల మీదుగా బడంపేటలోని శ్రీ రాచన్న స్వామి ఆలయానికి మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకోనున్నట్లు వెల్లడించారు. ఆలయానికి చేరుకున్న అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్రలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం తిరుగు ప్రయాణానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు, వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా పాదయాత్రను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులు జిల్లా కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, సెప్టెంబరు 5:** విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకుంటూ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు.

కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న ప్రతి ఒక్కరి విజయానికి పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. విద్యార్థుల కోణంలో ఆలోచించి, వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, నిరంతర అభ్యాసం, విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాసను పెంపొందించేలా వారిని తీర్చిదిద్దాలని కోరారు.

పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తే.. ఆ జ్ఞానాన్ని జీవితంలో ఎలా ఉపయోగించుకోవాలో నేర్పేది ఉపాధ్యాయులేనన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ఆచరణాత్మక విలువలను విద్యార్థులకు అందించి, సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేలా చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

విద్యార్థుల్లోని లోపాలను గుర్తించి సరిదిద్దడంతో పాటు, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. విద్యార్థి విజయాన్ని చూసి సంతోషించే గురువు.. వైఫల్యం ఎదురైనప్పుడు ధైర్యం చెప్పి, మళ్లీ ప్రయత్నించేలా ప్రోత్సహించాలని అన్నారు.

విద్యార్థులతో ప్రతిరోజూ కనీసం ఐదు నుంచి పది నిమిషాల పాటు దినపత్రికలు చదివించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తద్వారా విద్యార్థుల్లో సామాజిక అవగాహన, విలువలు పెంపొందడంతో పాటు భవిష్యత్తులో పోటీ పరీక్షలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.పాఠశాల నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా జీవితాంతం మనతో నిలిచిపోయేదే నిజమైన విద్య అని పేర్కొన్నారు. పాఠశాలలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు తమ జీవితంలో, సమాజంలో ఆచరణలో పెట్టగలిగితేనే ఉపాధ్యాయుల బాధ్యత సంపూర్ణంగా నెరవేరినట్లు అవుతుందని అన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు ఆధునిక బోధనా విధానాలను ఆకళింపు చేసుకుని పాఠ్యప్రణాళికలను రూపొందిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి తెలిపారు. విద్యార్థులకు ఆదర్శవంతమైన, ఆధునిక విద్యను అందిస్తూ విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. దేశానికి అవసరమైన భావితరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. పూల మొక్కలను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



**జహీరాబాద్, సెప్టెంబరు 5 ప్రజాబలం ప్రతినిధి:** మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని అల్లిపూర్ గ్రామం నేతాజీ నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నేతాజీ నగర్‌కు చెందిన మట్టు నరేష్ (31), తండ్రి పెంటయ్య, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసై, కుటుంబ సభ్యులు ఎంతగా చెప్పినా మద్యం సేవించడం మానలేదని తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబరు 5న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి అన్న మట్టు నర్సిములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జహీరాబాద్ టౌన్ ఎస్సై లవకుమార్ తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com